ఏప్రిల్ 2018
రూ. 20

# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక



విశ్వాంతరాలలోకి  తరలిపోయిన నిరంతర విశ్వాన్వేషి

## స్టీఫెన్ హాకింగ్



ఒర్లాండో (యు ఎస్ ఎ ) లో శ్రీరామనవమి వేడుకలు




# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -7 ఏప్రిల్ 2018 సంచిక -7



వ్యవస్థాపక సంపాదకురాలు:

తీగవరపు శాంతి


## ఈ సంచికలో

### ప్రత్యేక ఆకర్షణలు


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| గోవిందం భజ మూఢమతే | 6 |
| జయ గోవిందుని భజన చేయరా | 8 |
| వందేళ్ళు దాటిన గ్రంధాలయాలు | 10 |
| అమెరికా పౌరసత్వం పొందడం ఎలా? | 11 |
| RSVP | 14 |
| ఒక చెదరని స్వప్నం | 18 |
| నైమిశారణ్య యాత్ర | 27 |
| కర్తవ్యం | 31 |
| ప్రతిభ | 39 |
| వైశాఖ మాస వైశిష్ట్యం | 43 |


### ధారావాహికములు:


| | |
|---|---|
| బొమ్మలు చెప్పిన బాలల.. | 16 |
| రసాయన శాస్త్రం | 19 |
| మిస్ మేఘమాల | 21 |
| కాశీ ఖండం | 24 |
| సంభాషణ సంస్కృతం | 32 |
| మా ఊరి నందుల కథ | 37 |
| ప్రహేళిక | 42 |
| రాశి ఫలాలు | 48 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# అసంబ్లీ అంటే ఏక పక్షమా ?

అసెంబ్లీ సమావేశాలు వస్తున్నాయంటే ప్రజల్లో ఎంతో ఆత్రుత ఉంటుంది. ఎటువంటి ప్రశ్నలతో ప్రతి పక్షాలు అధికార పక్షాలను ఉక్కిరి బిక్కిరి చేస్తాయి? మన సమస్యలకు పరిష్కార మార్గాలను అధికార పక్షాలు చూపిస్తాయా? ప్రతి పక్షాలు అడిగే ప్రశ్నలకు అధికార పక్షాలు ఏమి సమాధానాలు చెబుతాయి అని ప్రజలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలంటే ఎంతో ఖర్చు, శ్రమ, దానికి తగ్గ ఏర్పాట్లు చెయ్యడానికి విలువైన సమయాన్ని కేటాయించ వలసి వస్తుంది. వీటి కోసం ప్రజాధనం ఖర్చవుతుంది. రాష్ట్ర ప్రజల సమస్యలను ప్రజల ముందుకు తీసుకు వచ్చి పరిష్కారమార్గాలు చూపించాలి. వాటి కోసం అయ్యే ఖర్చును లెక్కలు కట్టి చూపించ వలసిన బాధ్యత కుడా ప్రభుత్వానిదే. అయితే ఆ లెక్కలు సరిగ్గా ఉన్నాయా లేదా అని చూసి అధికార పక్షాలు ప్రజలను మోసగిస్తున్నాయా? అని కుడా గమనించి అవసరమైతే అడ్డుకుని సరిచేయవలసిన బాధ్యత ప్రతిపక్షాలకు ఉంది .

అంటే ఇటు అదికార పక్షానికి ఒకరకమైన బాధ్యత ఉంటే, ప్రతి పక్షానికి కూడా ఉన్న బాధ్యత తక్కు-వేమీ కాదు. ప్రజల అవసరాలు తీర్చడంలో అధికారపక్షం తన బాధ్యతను ఎంతవరకు నిర్వహిస్తోంది? కేంద్రం నుండి నిధులు సక్రమంగా వచ్చేటట్టు ప్రయత్నిస్తోందా? ఆ నిధులు దుర్వినియోగం కాకుండా ప్రజల అవసరాలు ఎంతవరకూ తీరుస్తోంది, అని చూడ వలసిన బాధ్యత కుడా ప్రతిపక్షం మీద ఉంది.

అయితే ప్రతిపక్షం లేకుండానే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించబడుతున్నాయి. అంటే మనం పైన చెప్పుకున్నవి అన్నీ జరగకుండానే సమావేశాలు అయిపోతున్నాయి. అంటే ప్రతి పక్షం పని అసలు లేదా? అయితే మనం ప్రతిపక్షాలకు ఓటు వేసి వారిని గెలిపించినందుకు వారు అధికార పక్షాలను ఎప్పటి-కప్పుడు నిలదీయాలి. అధికార, ప్రతి పక్షాలు ప్రజలను తక్కువ అంచనా వేస్తున్నాయా? ప్రజలు అంతా గమనిస్తూనే ఉంటారు. అలాగే ప్రజలు కూడా చైతన్య వంతులు కావాలి. అధికార ప్రతి పక్షాలను ఎప్పటి కప్పుడు ప్రజలందరూ కలిసి కట్టుగా నిలదీయాలి. మనం ఎన్నుకున్న అధికార పార్టీ తాను ఎన్నికల ముందు ఊదర గొట్టిన వన్నీ తీర్చ గలిగిందా? ప్రతిపక్షం తన బాధ్యత సరిగ్గా నేరవేరుస్తోందా? అనే అన్ని విషయాలను ప్రజలు గమనిస్తూనే ఉంటారు. ఎన్నికలు వచ్చాయి కదా అని ఎవరికీ వారే ప్రగల్భాలు పలికినా ప్రజల లెక్కలు తక్కువగా ఉండవు. ఏ పార్టీ అనేది వారికి ముఖ్యం కాదు. మనకేం చేశారన్నదే వారికి ముఖ్యం. అలాగే ప్రతి పక్షం అసెంబ్లీకి రాకపోయినా, తప్పు అధికార పక్షానిదా? ప్రతిపక్షానిదా? తప్పు ఎక్కడ అన్నది ప్రజలు అంచనా వేసుకుంటారు. అంతే కాని పైకి మీడియాలో ఏదో మనల్ని మనం సమర్ధిం చుకున్నాం కదా! అని ఎవరికి వారు అనుకుంటే పొరపాటే. ప్రజలు ఓట్లు వేసి గెలిపించి, అధికారాన్ని కట్టబెట్టి, ఇంతింత జీతాలు, ఇంకా ఎన్నో రకాలుగా సదుపాయాలు ఇస్తున్నది ప్రజల కోసమే అనే విషయాన్ని మరిచిపోకూడదు. ఎన్నికలు వస్తున్నాయంటే చాలు రాజకీయ పార్టీలలో ఎక్కడలేని హడావిడీ. వేరే వారిని దుమ్మెత్తి పొయ్యడమే సరిపోతోంది. ప్రజలు కూడా వారు చూపించే మామూళ్ల-కు, లంచాలకు ఆశపడి ఓట్లు వేసి గెలిపిస్తున్నారు. తరువాత వారికి జరుగుతున్న నష్టం వారికి అర్ధం కావడం లేదు వారికి. అన్ని విషయాలలోనూ విదేశాలతో పోల్చుకునే రాజకీయ నేతలు ఎన్నికలలో వారిని ఎందుకు అనుకరించాలని అనుకోరు? వారు ఏమి చేస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేస్తారో, అవి చెయ్యడానికే ప్రయత్నిస్తే, ప్రజల ముందు చెయ్యి చాచే, ఈ విధమైన హడావిడి ఉండదు కదా ?

ముందుకు రండి. మీరు అడగకుండానే ఓటు వేసి మిమ్మల్ని గెలిపిస్తారు.

ఇంక డైలీ సీరియల్ లాగా నడుస్తున్న మరొక 'హంగామా': అవిశ్వాస తీర్మానం సాధించడంలో ఎవరి పాత్ర ఎంత అనేది ప్రజలు అంచనాలు వేసుకుంటున్నారు.

ప్రజలలోను, రాజకీయ నేతలలోను చైతన్యం రావలసిన అవసరం ఎంతో ఉంది.



తీగవరపు శాంతి

.

# అభిప్రాయ వేదిక

శ్రీదేవి ముఖచిత్రం తో వచ్చిన మార్చి సంచిక చాలా సుందరంగా ఉంది. మహా నటి శ్రీదేవి గురించి పోడూరి శ్రీనివాసరావు గారు వ్రాసిన వ్యాసం బాగుంది.

దేవేందర్, పద్మ - ఖమ్మం

భువనచంద్ర గారి 'బ్రహ్మ జ్ఞాని' కథ బావుంది. జ్ఞానోదయం ఎవరినుంచి కలుగుతుందో ఎవరూ చెప్పలేము. చక్కని కథ!

భూలక్ష్మి, నారాయణరావు- హైదరాబాదు

సంగీతం యాంత్రికంగా కాకుండా ఎలా చెపితే భావయుక్తంగా పాడగలరో అని బాగా వ్రాసారు భారతి గారు. రచయిత్రికి ధన్యవాదాలు.

శ్రీహరి, వనజ - పెద అంబర్ పేట

స్త్రీకి స్వాతంత్ర్యం వచ్చిందా అని ఎడిటర్ గారు వ్రాసిన సంపాదకీయం చాలా ఆలోచింపచేసేదిగా ఉంది. సమాజంలోని ప్రతి వ్యక్తి ఇది చదవాలి. దంపతుల మధ్య, ముఖ్యంగా భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులైనప్పుడు వచ్చే సమస్యలు, చిలికి చిలికి గాలివాన లాగా ఎక్కడికి దారితీస్తున్నాయో మనం అందరూ చూస్తూనే ఉన్నాం. ఈ పత్రిక లో వచ్చే సంపాదకీయాలు పత్రికకే హైలైట్!

సుబ్బారావు, కుమార్, రాజబాబు - చిక్కడపల్లి

పాలెపు బుచ్చిరాజుగారి బొమ్మలు చెప్పిన బాలల కథలు, పిల్లలకే కాదు పెద్దలకీ నచ్చుతాయి అన్నది నిజం. మా ఇంటిల్లిపాది ఈ కథలు తప్పక ఆసక్తితో చదువుతాం. రచయితకు అభినందనలు.

వేణుగోపాలరావు, రాణి - విశాఖపట్నం

కవన శర్మ గారు రసాయన శాస్త్రం పై వ్రాస్తున్న వ్యాసాలు చాలా బాగుంటున్నాయి. సైన్స్ పదాలని తెలుగులో చక్కగా ఇస్తున్నారు. విద్యార్థులకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటోంది. రచయితకు మా హృదయపూర్వక నమస్కారాలు.

కామేశ్వరరావు- విజయవాడ

మాలతి, మేఘమాల కలిసి హాయిగా ఎంజాయ్ చెయ్యడం బాగు నచ్చుతోంది. ఇన్నాళ్ళకు వాళ్ళిద్దరూ కలిసినందుకు చాలా బాగుంది. చక్కటి శైలితో వ్రాస్తున్న రచయిత్రి గారికి మా ధన్యవాదాలు.

సప్న, సీత, సుబ్బలక్ష్మి, మాలతి - హైదరాబాదు

శ్రీనాథుని కాశీఖండం చాలా చక్కగా ఉంది. అమోఘమైన వర్ణనతో వ్రాస్తున్న శ్రీ మురళీకృష్ణ గారికి మా ధన్యవాదాలు.

మోహనరావు, ఈశ్వరి - వరంగల్

తుమ్మూరి రాం మోహనరావు గారి నైమిశారణ్య యాత్ర కళ్ళకు కట్టినట్టుగా వ్రాస్తున్నారు.ఎప్పుడప్పుడు రెండో భాగం చదువుదామా అని ఆత్రుతగా ఉంది.

సాయిబాబు, సత్యనారాయణ, అంజని - కడప

దుర్గాప్రసాదరావుగారి సంస్కృత పాఠాలు చాల చక్కగా ఉన్నాయి. భాష నేర్చుకోవటానికి ఇవి చాలా ఉపయోగం. రచయితకు ధన్యవాదాలు.

ఆచారి, భారతి, అకివేలు, రంగారావు - కర్నూలు

ఎలెక్ట్రాన్ గారి కథ నాకు చాలా నచ్చింది. విద్యావిధానం మీద ఆయన వ్రాస్తున్న రచనలు చాలా విశ్లేషణతో ఉంటున్నాయి. రచయితకు 'థేంక్ యూ'

నీరజ, భగవాన్లు - వైజాగ్

జనార్ధన్ ఠాకూర్ గారి రాశి ఫలాలు బాగుంటున్నాయి. ఆయనకు ధన్యవాదాలు. అలాగే చైత్ర మాసం గురించి రామానందం గారు చక్కగా వివరించారు.

సుబ్రహ్మణ్యం, హేమ - అమలాపురం

# భువనచంద్ర

## గోవిందం భజ మూఢమతే



"మనిషి ఎందుకు పుడుతున్నాడూ? ఎందుకు చనిపోతున్నాడూ? ఈ పుట్టుక .... చావుల మధ్య ఎన్ని కలలు కంటున్నాడు! అక్కడితో ఆగదు... కల నిజమైతే సంతోషం,కల కల్లయితే దుఃఖం. ఎన్నెన్నో బంధాలు. అన్నీ తగిలించుకున్నవే. పరువు అంటున్నాడు.... ప్రతిష్ట అంటున్నాడు...... సంచిత కర్మో, ప్రారబ్ధ కర్మో అని విచారణ చేస్తున్నాడు. దైవం అంటున్నాడు... భజనలూ, పూజలూ చేస్తున్నాడు. దెయ్యం అంటున్నాడు.. బలులు అర్పిస్తున్నాడు..... క్షుద్రపూజలు చేస్తున్నాడు........ నియంత అంటున్నాడు. జనాల మాన ప్రాణాలు హరిస్తున్నాడు. మహాత్ముడై అహింసను బోధిస్తున్నాడు... విజ్ఞానినంటూ రకరకాల 'ఇజా'లని కనిపెట్టి నిజాల్ని భూస్థాపితం చేస్తున్నాడు. పరిశోధకుడై ఆకాశాల్నీ, సముద్రాల్నీ జయిస్తున్నాడు. ప్రకృతి ప్రళయాలొచ్చి తను కట్టిన సౌధాలు కూలిపోతే సృష్టిలో తన 'అల్ప'తను తలచుకుని తానే విలపిస్తున్నాడు... మతం అంటూ నరుక్కుంటున్నాడు.. కులం అంటూ తోటి మానవుడ్నే ద్వేషిస్తున్నాడు...



అసలీ రెండు కాళ్ళ మృగానికేంకావాలీ?" నిర్వేదంగా ప్రశ్నించారు స్వామీజీ. ఆ ప్రశ్న కూడా జనాన్ని ఉద్దేశించి వేసింది కాదు, తనను తను ప్రశ్నించుకున్నట్టుగా అనిపించింది.

యోగవాశిష్టంలో రాముడు వశిష్టుడితో అంటాడు: "అయ్యా! మనుషుల/జీవుల బ్రతుకులు ఆకు అంచున నిలిచివున్న వాన చినుకుల్లాంటివి. ఎప్పుడు రాలిపోతాయో ఎవరికీ తెలుసూ?" అని. ( ఈ మాటలనే 'మాధురి' అనే సినిమాకు నేను పాటగా మలిచాను)

"మరణమనేది మరో జననానికి పునాది" అన్నాడు మరో తత్వవేత్త.

"జననమరణాలు సైకిలు చక్రంలాంటివి. ఆ భ్రమణం సాగిపోతూనే వుంటుంది" అన్నాడు ఓ ప్రాజ్ఞుడు.

"రెండూ భ్రమలే... రెండూ మనోజనితాలే" అన్నాడో మాయావాది.

"లోకంలో చావుపుట్టుకల గురించి ఎన్నో విషయాలు ప్రచారంలో ఉన్నాయి. స్వర్గం నరకం ఉన్నాయని కొందరూ, లేదని అనేది కొందరూ, ఇలా వాదోపవాదాలు

యుగాలనుంచీ జరుగుతూనేవున్నాయి. అన్నీ వాదాలే కానీ, చూసి, వచ్చి, నిర్ధారించినవారు ఒక్కరూ లేరు. ఎవ్వరూ లేనంత మాత్రాన అవన్నీ కల్పితాలు అనీ అనలేము. ఒకడు కూటికి లేని పేదవాడుగా ఎందుకు పుడుతున్నాడు? ఇంకొకడు పేదవాడుగా పుట్టి కూడా కోట్లకి పడగలెత్తుతున్నాడెందుకూ? మరొకడు కోటీశ్వరుడుగా పుట్టికూడా అన్నీ పోగొట్టుకుని ఎందుకు బిచ్చగాడవుతున్నాడూ? ఇవన్నీ పూర్వజన్మకి సంబంధించిన ఫలితాలా? ప్రతి జన్మలోను లాభనష్టాల చిఠాలాగ పుణ్యాపాపాల చిఠాలు వేసుకోవాలా? లేక వేయబడతాయా? ఐతే వేసేది ఎవరూ? ఎందుకు వేస్తున్నారూ? అరవై యేళ్ళో డెబ్భైయేళ్ళో యీ శరీరంలో చరించి, సుఖించి, కష్టించి, అనేకానుభవాలను మూటకట్టుకున్న మనిషి క్షణంలో ఎందుకు మృత్యువు పాలవుతున్నాడూ? ఆ శరీరంతోనే అతని అనుభవమూ మట్టిలో కలిసిపోయేప్పుడు ఇన్నిరకాల ఆటుపోట్లకి అసలు ఎందుకు గురికావాలీ? పోనీ యీ జనన మరణ చదరంగం దేముడనేవాడు ఆడిస్తూ, ఆడుతూ వినోదిస్తున్నాడనుకుంటే, మానవులూ, జీవులూ చదరంగంలోని ప్రాణంలేని పావులు కాదుగా!" మళ్ళీ తనలో తానే అనుకున్నట్టుగా అన్నారు స్వామీజీ. ఆయన కన్నులు శూన్యంలోకి చూస్తున్నాయి.

"అంతేకాదు స్వామీజీ, హిందీలో బహుళ ప్రచారం పొందిన పాట ఒకటుంది. 'దునియా బనానేవాలే.. క్యా తేరే మన్ మే సమాయీ' అని. అందులో కవి అంటాడూ, 'లోకాన్నీ జీవుల్నీ సృష్టించావు, అన్నీ తోలుబొమ్మలే....... మట్టి బొమ్మలే, మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగి, మట్టిలో కలిసిపోతాయి. సరే... మళ్ళీ లోకాన్ని సృష్టించి వూరుకున్నావా? లేదే నవ్వడం నేర్పినవాడివి ఏడుపుని ఎందుకిచ్చావూ? స్నేహాన్నిచ్చినవాడివి వియోగాన్ని ఎందుకిచ్చావూ? జీవితాన్ని ఓ తిరునాళ్ళుగా మార్చావెందుకయ్యా?" అని వివరించాడో భక్తుడు.

"అవునవును. తెలుగులో కూడా వుందిగా 'వెలుగునిచ్చినది నీవైతే మరి చీకటిని ఎందుకిచ్చావూ? చూపునిచ్చింది నీవైతే మరి అంధత్వాన్నెందుకిచ్చావూ?' అని" తానూ వివరించిందో భక్తురాలు.

నిశ్శబ్దం తాండవమాడింది. ఏ ప్రశ్నకూ సమాధానం లేదు. అయ్యా అయిదు దశాబ్దాల తరవాత కూడా ఇవే ప్రశ్నలు మళ్ళీ గుర్తుకొచ్చాయి. ఎంత వెదికినా మనసుని, 'నిజమైన' సమాధానాలు మాత్రం లభ్యంకాలేదు.

నిన్నటివరకూ ఆ జీవి ఈ లోకంలో ఉన్నారు. ఈ క్షణం లేరు. నిన్నటివరకు పేరుతో పాటు 'గారు, వారు' లాంటి గౌరవవచనాలతో సంబోధించే మనుషులే ఇవాళ "బాడీ ఇంట్లో ఉందా లేక ఇంకా హాస్పటల్లోనే ఉంచారా?" అని అడుగుతున్నారు. కనీసం పేరుని కూడా పలకడం లేదు. 'బాడీ'గా గుర్తింపు పొందుతోంది.

నిన్నటివరకూ ఆ పాదాలకు తల ఆన్చి, నమస్కరించి పరమానందం పొందినవారు ఇప్పుడు భయంభయంగా పాదాలు అంటీఅంటనట్టు ముట్టుకుని 'మైల' అంటూ ఇంటికి వెళ్ళి స్నానం చేస్తున్నారు. నిన్నటిదాకా వున్నదీ నేడు లేనిదీ ఏమిటి???

"శ్వాస"

అది వున్నంతకాలం ఈ శరీరం 'శివం'. ఆ శ్వాస ఆగిన మరుక్షణం ఇది 'శవం'. అంతే తేడా.

"భజ గోవిందం.. భజ గోవిందం.. గోవిందం భజ మూఢమతే.." దూరాన శంకరాచార్యులవారి భజగోవింద శ్లోకాలు ఎవరో చక్కగా పాడుతున్నారు.

ఎందుకో తెలుగులో వ్రాయాలనే కోరిక కలిగింది. ఇది క్రింది బాక్స్ లో ఉన్న ఆత్మీయమూర్తికి నివాళి.



# జయ గోవిందుని స్మరణ చేయరా

జయ గోవిందుని స్మరణ చేయరా
హరి గోవిందుని శరణు వేడరా
మరణకాల మాసన్నమైనచో
వ్యాకరణము నిను....రక్షించదురా.. జయ||

ధనసంపాదన వెంటపడకురా
సద్బుద్ధిని అలవరచు కొనుమురా
శ్రమతో వచ్చిన ధనమె మేలురా
తృప్తిని మించిన ధనమె లేదురా.. జయ||

మగువల జూచీ మోహపడకురా
రక్తమాంసముల మాయే ఆదిరా
భవ బంధముల.... భ్రాంతిని వదలీ
మననముతో నీ మనసు గెలువరా..జయ||

తామరాకుపై బిందువువోలే
నిలచివున్నదీ ఈ జీవితమూ
రోగములకు నెలవైన తనువునకు
బాధలు తప్ప సుఖమెక్కడిదిరా.. జయ||

ధనసంపాదన ఉన్నంతవరకే
నీ బలగము నిను .. గౌరవించురా
శక్తులు వుడిగిన వార్ధక్యములో
ఒక్క క్షణమైనా పలుకబోరురా ... జయ|

తనువున వూపిరి వున్నంతవరకే
నీవారలు నీవద్ద చేరెదరు
ప్రాణము పోయిన..మరుక్షణమున ..నీ
సహచరియైనా ...దరిచేరదురా... జయ||

ధనముతో వచ్చు అనర్ధములెన్నో
ధనము తెచ్చు మనో క్లేశములెన్నో
ధనవంతులు తమ సుతులను జూచీ
భయపడెదరు ఇది లోకరీతిరా .... జయ||

బాల్యమంతయూ ఆటలతోనూ
యవ్వనమంతా...మోహముతోనూ
వార్ధక్యము పలుచింతలతోనూ
గడిపెదరందరు..'పరము'ను మరచీ..జయ||

భార్యన ఎవరూ?...పుత్రులు ఎవరూ?
నీవసలెవరూ? నీదనుదేదీ ?
ఎచ్చటనుంచీ...ఇట కొచ్చితివో
ఆ విషయములను .. యోచింపుమురా.. జయ||

సత్సంగముతో భ్రమ విడిపోవును
భ్రమలు వీడిన.. మోహము తొలగును
మోహము తొలగిన ..మది నిశ్చలము
నిశ్చల తత్వమే.. ముక్తి నొసగురా .. జయ||

వయసుడిగినచో.. కామమెక్కడ?
నీరెండినచో చెరువు ఎక్కడ?
ధనము లేక పరివారమెక్కడ?
తత్వము తెలిసిన బంధమెక్కడ? .. జయ||

ధనమూ బలగము నవయవ్వనమూ
కాలముతోటే కరగిపోవురా
శాశ్వతమైనది బ్రహ్మమొక్కటే
అది తెలుసుకు ఆనందమందరా.. జయ||

రేయీ పవలూ రోజులు నెలలూ
వడి వడి వడి గా తరలిపోవురా
క్షణ క్షణ మాయువు క్షీణిస్తున్నా
మనుజుని ఆశ.. మది వీడదురా.. జయ||

సద్గురు శంకర భగవత్పాదులు
ఉపదేశించిన తత్వము ఇదిరా
శ్రవణము చేసిన మాయ తొలగురా..
మననము చేసీ.. మోక్షమందరా .. జయ||

అయ్యా.. పద్మాచార్యులవారూ, తోటకాచార్యులవారూ, హస్తమలకాచార్యులవారూ, సుబోధ, నిత్యానందులవారూ, ఆనంద, నిత్యానాధ, యోగానంద, నరేంద్రాచార్యులవారూ, వార్తికకారులు, ధృఢభక్తుని ఉపదేశములు వ్రాయవలసిఉన్నది.

ఆ క్షణంలో మనసులో మెదిలింది వ్రాసాను. తప్పులుంటే క్షమించండి. మీ సవరణలను తలదాలుస్తాను. నమస్కృతులతో...

మీ భువనచంద్ర (098401 70646)
email: bhuvanachandra@ gmail.com

# తెలంగాణలో వంద ఏళ్ళు దాటిన గ్రంథాలయాలు

తెలంగాణలో వంద ఏళ్ళు దాటిన గ్రంథాలయాల చరిత్రను గ్రంథస్థం చేసి ప్రజలకు అందించాలన్న సంకల్పంతో తెలంగాణగ్రంథాలయ పరిషత్తు ఒక కార్యక్రమానికి అంకురార్పణ చేసింది. క్రీ.శ. 2017 వరకు వందేళ్ళు పూర్తి అయిన గ్రంథాలయాల జాబితాను కొంతవరకు సేకరించింది. మా దృష్టికి రాని వందేళ్ళ గ్రంథాలయాలు ఇంకా మరెన్నో ఉండవచ్చని తెలియవచ్చింది. వీటికి సంబంధించిన సమాచారం(ఫొటోలు, పత్రికల వార్తలు, వ్యాసాలూ, సావనీర్లు, పుస్తకాలు, ప్రత్యక్ష సాక్షుల జ్ఞాపకాలు) ఏదైనా ఉంటె తెలంగాణగ్రంథాలయ పరిషత్తుకు తెలియజేయవలసిందిగా విజ్ఞప్తి. ప్రస్తుతం ఉనికిలో ఉన్నవీ, లేనివీ కలిపి వందేళ్ళ గ్రంథాలయాల తొలి జాబితా ఇలా వుంది.

1. ప్రజాహిత గ్రంథాలయం (1870) సికింద్రాబాదు
2. ముదిగొండ శంకరారాధ్య గ్రంథాలయం (1872) సికింద్రాబాదు
3. యంగ్ మెన్ ఇంప్రూవ్ మెంట్ సొసైటీ (1879) హైదరాబాదు
4. నిజాం క్లబ్ గ్రంథాలయం (1883) హైదరాబాదు
5. వాలంటీర్ క్లబ్ గ్రంథాలయం (1884) హైదరాబాద్
6. దైరతుల్ మారిఫ్ ఉల్ ఉస్మానియా (1889) హైదరాబాదు
7. ఆల్బర్ట్ రీడింగ్ రూమ్ (1890) సికింద్రాబాదు
8. అసఫియా లైబ్రరీ (1891) హైదరాబాదు
9. భారత్ గుణవర్ధక సంస్థ గ్రంథాలయం (1895) హైదరాబాదు
10. బొల్లారం లైబ్రరీ (1896) బొల్లారం
11. శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం (1901) హైదరాబాదు
12. శ్రీ రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషానిలయం (1904) వరంగల్
13. ఆంధ్ర సంవర్ధినీ గ్రంథాలయం (1905) సికింద్రాబాదు
14. ఆంధ్ర భాషాభివర్ధక సంఘం (1905) శంషాబాదు
15. మన్మోహన్ ఆంధ్ర పుస్తకాలయం (1907) వడ్డేపల్లి
16. శబ్దానుశాసన ఆంధ్ర భాషా మందిరం (1908) వరంగల్
17. జ్ఞాన విద్యుత్ ప్రవాహిని ఆంధ్ర భాషా నిలయం (1910) ఖమ్మం
18. మహబూబియా అంధ్ర భాషా నిలయం (1911) ఎర్రుపాలెం
19. శ్రీ విరాట్రాయాంధ్ర భాషా నిలయం (1912) నేలకొండపల్లి
20. ఆంధ్ర యువజన సంఘం గ్రంథాలయం (1913) సికింద్రాబాదు
21. సంస్కృత కళా సంవర్ధిని గ్రంథాలయం (1913) సికింద్రాబాదు
22. శ్రీ సిద్ధి మల్లేశ్వర గ్రంథాలయం (1913) రేమిడిచర్ల
23. మహబూబియా రీడింగ్ రూమ్ (1915) నల్లగొండ
24. ఆంధ్రా విజ్ఞాన ప్రకాశిని గ్రంథ నిలయం (1917) సూర్యాపేట
25. శ్రీ బాలభారతి ఆంధ్రా భాషా మందిరము (1917) శంషాబాదు
26. ఆంధ్ర సరస్వతీ గ్రంథాలయం (1918) నల్గొండ
27. రెడ్డి హాస్టల్ గ్రంథాలయం (1918) హైదరాబాదు
28. జ్ఞాన విద్యుత్ ప్రవాహిని విద్యార్థి సంఘం గ్రంథాలయం (1918) ఖమ్మం

-డా. అయాచితం శ్రీధర్, అధ్యక్షుడు, తెలంగాణ గ్రంథాలయ పరిషత్, రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం, అఫ్జల్ గంజ్, హైదరాబాదు - 500012 ఫోన్: 040-24613238, 9849893238, 9666951258

# తోటకూర ప్రసాద్


## అమెరికా దేశపు పౌరసత్వం పొందడం ఎలా?



* అమెరికా దేశంలో ఉన్న వనరులు, అవకాశాలను దృష్టిలో పెట్టుకొని ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ఏదో విధంగా అమెరికా చేరుకొని అమెరికా దేశపు పౌరసత్వాన్ని పొంది స్థిర నివాసం ఏర్పరుచుకోవాలనే కలలు కంటూ ఉంటారు. అయితే కొద్ది మంది మాత్రమే ఈ కలలను సాకారం చేసుకోగల్గుతారు.

* 2016 సంవత్సరంలో దాదాపుగా పది లక్షల మంది అమెరికా పౌరసత్వానికై దరఖాస్తు చేసుకోగా ఏడు లక్షల యాభై రెండు వేల ఎనిమిది వందల మందికి అమెరికా దేశ పౌరసత్వం లభించింది.

* అమెరికా ప్రభుత్వపు నివేదిక ప్రకారం 2016 లో లక్షా మూడు వేల ఐదు వందల యాభై (1,03,550) మంది మెక్సికన్ దేశస్తులు, 46,100 మంది ప్రవాస భారతీయులు, 41, 285 మంది ఫిలిప్పీన్స్ దేశస్తులు అమెరికా పౌరసత్వాన్ని పొందగల్గారు.

* అమెరికా దేశపు పౌరసత్వాన్ని మూడు రకాలుగా పొందే అవకాశం ఉంది:

1. అమెరికా దేశంలో జన్మించడం ద్వారా
2. వారసత్వపు హక్కు ద్వారా
3. తగిన అర్హతలు సంపాదించడం ద్వారా

### 1. అమెరికా దేశంలో జన్మించడం ద్వారా:

* అమెరికా దేశంలో ఉన్న ఏ 50 రాష్ట్రాల్లో జన్మించినా లేదా అమెరికా అధీనంలో ఉన్న పోర్టోరీకో, గ్వామ్, యూ.ఎస్. వర్జిన్ ఐలాండ్స్, మరియు నార్తర్న్ మరయానా ఐలాండ్స్ లో 1986 తరువాత జన్మిస్తే.

### 2. అమెరికా దేశం వెలుపల జన్మించిన పిల్లలకు వారసత్వపు హక్కు ద్వారా:

i. అమెరికా పౌరులైన దంపతులకు (కనీసం ఒకరు అమెరికాలో గతంలో గాని ప్రస్తుతం గాని నివాసం ఉండి ఉండాలి) జన్మించిన పిల్లలకు అమెరికా పౌరసత్వం లభిస్తుంది.

ii. దంపతులలో ఒకరికి మాత్రమే అమెరికా దేశపు పౌరసత్వం ఉంటే - ఆ పౌరసత్వం ఉన్న వారు పిల్లలు పుట్టే సమయానికి

కనీసం 5 సంవత్సరాలు అమెరికాలో నివసించి ఉండి ఉండాలి. అమెరికా దేశపు పౌరసత్వం ఉన్న వారు ఈ 5 సంవత్సరాల అమెరికా నివాసంలో, 14 సంవత్సరాల వయస్సు దాటిన తరువాత కనీసం 2 సంవత్సరాలు అమెరికాలో ఉండి ఉండాలి.

అప్పుడు వారికి పుట్టిన పిల్లలకు కూడా పౌరసత్వం లభిస్తుంది.

a. ప్రత్యేక పరిస్థితులు:

ఈ క్రింది పరిస్థితులలో పైన పేర్కొన్న 5 సంవత్సరాల కాల పరిమితి వర్తించదు:

i. ఇతర దేశాల్లో ఉండి అమెరికా సైనిక అధికారిగా పనిచేస్తున్నప్పుడు

ii. ఇతర దేశాల్లో అమెరికా ప్రభుత్వపు అధికారిగా పనిచేస్తున్నప్పుడు

iii. ఇతర దేశాల్లో కొన్ని అంతర్జాతీయ సంస్థల ద్వారా పనిచేస్తున్నప్పుడు

iii. పెళ్లి కాకుండా సహజీవనం ద్వారా పిల్లలు కలిగినప్పుడు –

* తల్లి అమెరికా దేశపు పౌరురాలై ఉండి తండ్రి కాకపోతే – తల్లి తనకు పిల్లలు పుట్టే సమయానికి ఒక సంవత్సరం ముందు అమెరికా దేశంలో నివసించి లేదా నివసిస్తూ ఉండి ఉండాలి
* తండ్రి అమెరికా పౌరుడై ఉండి తల్లి కాకపోతే – తండ్రి రాతపూర్వకంగా ఆ పుట్టిన శిశువుకు
o తానే తండ్రినని
o ఆ శిశువు 18 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తానని
o ఆ శిశువు జననానికి ముందు తండ్రి కనీసం 5 సంవత్సరాలు అమెరికాలో నివసించి ఉండాలి. ఈ 5 సంవత్సరాల అమెరికా నివాసంలో, 14 సంవత్సరాల వయస్సు దాటిన తరువాత కనీసం 2 సంవత్సరాలు అమెరికాలో ఉండి ఉండాలి.

## 3. తగిన అర్హతలు సంపాదించడం ద్వారా: (N-600)

కనీసం 5 సంవత్సరాల పాటు గ్రీన్ కార్డు కలిగి ఉండాలి మరియు

* 18 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి
* పౌరసత్వానికై దరఖాస్తు చేసేనాటికీ కనీసం 3 నెలలు ముందుకాలం అమెరికాలో ఉండి ఉండాలి.
* పౌరసత్వానికై దరఖాస్తు చేసేనాటికీ ఈ 5 సంవత్సరాల కాలంలో కనీసం 30 నెలలు అమెరికాలో ఉండి ఉండాలి
* దరఖాస్తు చేసిన నాటి నుండి పౌరసత్వం పొందే వరకు అమెరికా దేశంలో నివసిస్తూ ఉండాలి. ( కాని సెలవులపై విదేశీ ప్రయాణాలు చేయవచ్చు)
* అమెరికా దేశపు చరిత్ర, ప్రభుత్వ పరిపాలనా విధానం తెలిసి ఉండి ఆంగ్ల భాష చదవడం, రాయడం, మాట్లాడటం కొంత వరకైనా వచ్చి ఉండాలి.
* అమెరికా రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవిస్తూ, భాధ్యతాయుతమైన వ్యక్తిగా మెలిగి ఉండాలి.

### అమెరికా పౌరసత్వం ఉన్న వారితో వివాహం జరిగితే

* కనీసం 3 సంవత్సరాలు పాటు గ్రీన్ కార్డు కలిగి ఉండాలి
* 18 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి
* పౌరసత్వానికై దరఖాస్తు చేసేనాటికీ కనీసం 3 నెలల ముందుకాలం అమెరికాలో ఉండి ఉండాలి.
* ఆ 3 సంవత్సరాల కాలం పూర్తయి పౌరసత్వం కోసం దరఖాస్తు చేసి పౌరసత్వం పొందే వరకు వైవాహిక బంధంలోనే ఉండి ఉండాలి.
* పౌరసత్వానికై దరఖాస్తు చేసేనాటికీ ఈ 3 సంవత్సరాల కాలంలో కనీసం 18 నెలలు అమెరికాలో ఉండి ఉండాలి
* దరఖాస్తు చేసిన నాటి నుండి పౌరసత్వం పొందే వరకు అమెరికా దేశంలో నివసిస్తూ ఉండాలి. ( కాని సెలవులపై విదేశీ ప్రయాణాలు చేయవచ్చు)
* అమెరికా దేశపు చరిత్ర, ప్రభుత్వ పరిపాలనా విధానం తెలిసి ఉండి ఆంగ్ల భాష చదవడం, రాయడం, మాట్లాడటం కొంతవరకైనా వచ్చి ఉండాలి.
* అమెరికా రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవిస్తూ, భాధ్యతాయుతమైన వ్యక్తిగా మెలిగి ఉండాలి.

## గ్రీన్ కార్డు పొందడానికి కావలసిన అర్హతలు: ( I-485)

ఈ క్రింది పేర్కొన్న విధంగా గ్రీన్ కార్డు పొందవచ్చు –

1. కుటుంబ బంధం ద్వారా
2. ఉద్యోగం ద్వారా
3. పెట్టుబడి పెట్టడం ద్వారా
4. ప్రత్యేక పరిస్థితులలో
5. శరణార్థులు లేదా కాంది-

శీకులు
6. లాటరీ సిస్టం ద్వారా
7. పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా

## 1. కుటుంబ బంధం ద్వారా గ్రీన్ కార్డు :

* అమెరికా పౌరసత్వం లేదా గ్రీన్ కార్డు ఉన్నవారితో వివాహం జరిగితే
* మీ తల్లిదండ్రులు అమెరికా పౌరులు లేదా గ్రీన్ కార్డు ఉన్న-వారు అయితే ( ఒకవేళ తల్లి-దండ్రులు గ్రీన్ కార్డు ఉన్న వారు అయితే, వారి పిల్లలు అవివా-హితులుగా ఉన్నప్పుడు మాత్రమే అర్హులు)
* కనీసం 21 సంవత్సరాల వయస్సు ఉన్న మీ సోదరుడు లేదా సోదరి అమెరికా దేశపు పౌరులై ఉంటే
* అమెరికా పౌరసత్వం ఉన్న-వారితో పెళ్లి నిశ్చయమైతే
* మీ తల్లి లేదా తండ్రికి అమెరికా పౌరసత్వం కలిగిన వారితో వివాహం నిశ్చయమైన-ప్పుడు, మీరు కూడా గ్రీన్ కార్డు కు అర్హులే.

## 2. ఉద్యోగం ద్వారా గ్రీన్ కార్డు

* వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వారి యాజమాన్యం ద్వారా గ్రీన్ కార్డు కై దరఖాస్తు చేసుకోవచ్చు.

## 3. అమెరికాలో పెట్టుబ-డులు పెట్టడం ద్వారా గ్రీన్ కార్డు

* అమెరికాలో కనీసం 5 లక్షల డాలర్లు పెట్టుబడి పెట్టి కనీసం 5 ఉద్యోగాలను కల్పించడం ద్వారా లేదా 1 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టి కనీసం 10 ఉద్యో-గాలను కల్పించడం ద్వారా

## 4. ప్రత్యేక పరిస్థితుల్లో గ్రీన్ కార్డు:

* అమెరికా దేశంలోని లాభా-పేక్ష రహిత, మతపరమైన సంస్థ-ల్లో పని చేయడం ద్వారా
* విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసిన వారు
* గ్రీన్ కార్డు కల్గి ఉండి అమెరికా దేశానికి వెలుపల ఒక సంవత్సరం పైగా గడిపిన వారు
* అంతర్జాతీయ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు
* అమెరికా దేశపు అవసరా-లను దృష్టిలో పెట్టుకొని ఇతర దేశం నుంచి వచ్చి వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

## 5. శరణార్థులు లేదా కాం-దిశీకులకు గ్రీన్ కార్డు

* అమెరికా ప్రభుత్వం నుంచి శరణార్థులు లేదా కాందిశీకులు-గా గుర్తింపు పొందిన ఒక సంవ-త్సర కాలం తరువాత వారు గ్రీన్ కార్డు కై దరఖాస్తు చేసుకోవచ్చు.

## 6. లాటరీ పద్ధతి ద్వారా గ్రీన్ కార్డు

* కనీసం హైస్కూల్ స్థాయి విద్యార్హత కల్గి ఉండాలి లేదా గడిచిన 5 సంవత్సరాల కాలంలో 2 సంవత్సరాలు ఏదైనా ఉద్యోగం చేసి ఉండాలి.
* సాధారణంగా ప్రతి సంవత్స-రం అక్టోబర్ నెలలో కంప్యూటర్ లాటరీ పద్ధతి ద్వారా 55,000 వరకు గ్రీన్ కార్డులను జారీ చేస్తారు.

## 7. పేర్లు నమోదు చేసుకో-వడం ద్వారా గ్రీన్ కార్డు

* జనవరి 01, 1972 కి ముందు అమెరికాలో ప్రవేశించి, అమెరికా పౌరసత్వం పొందడానికి అర్హు-లైతే ప్రత్యేకంగా నమోదు చేసు-కోవడం ద్వారా గ్రీన్ కార్డు పొంద-వచ్చు. పూర్తి వివరాలకు www. prasadthotakura.com ను చూడండి

(ఈ వ్యాస రచయిత డాక్టర్. ప్రసాద్ తోటకూర గత మూడు దశాబ్దాలుగా అమెరికాలో స్థిరప-డి పలు సామాజిక సేవాకార్యక్ర మాల్లో చురుకుగా పాల్గొంటు-న్న ప్రముఖ ప్రవాస భారతీయ నాయకుడు.)

# పమ్మి భారతీ శర్మ



## ఆర్. ఎస్. వి. పి. (RSVP)

R S V P: ప్రతి ఆహ్వానం వెనుక, వివాహ పత్రికల వెనుక ఈ పదం ఉంటుంది. మనం చూసీ చూడనట్లు వదిలేస్తూ ఉంటాము. ఈ RSVP ఒక ముఖ్యమైన ప్రతిపాదన అని మనం గుర్తించాలి. ఈ పదం ఫ్రెంచ్ భాష నుండి వచ్చింది. దీని అర్థం : 'దయచేసి ప్రతిస్పందించండి" అని. అతిథుల స్వాగత, విందు కార్యక్రమంలో ఒక ఖచ్చితమైన 'తలల' లెక్కింపు అవసరం కదా! మనం ఏ చిన్న కార్యక్రమం, వేడుక చేసుకుంటున్నా, అందరికీ ఫోన్లు చేసి, లేదా మెయిల్స్, మెసేజ్ ల ద్వారా అందరినీ పిలుస్తాము. దానికి తగ్గట్టుగా బోలెడు ఏర్పాట్లు చేసుకుంటాము. తీరా 50 మందిని పిలిస్తే, 30 మందే రావడం, అతిథులను ఆహ్వానించడం, కార్యక్రమం, తిరిగి వారిని సాగనంపడం, ఇలా ఒకదాని తరవాత ఒకటి పనులతో మన పనులతో ఉక్కిరి బిక్కిరి అవుతాము...తీరా అంతా వెళ్ళాక చూస్తే బోలెడు పదార్థాలు మిగిలిపోతాయి. .. కొన్ని సమయం దాటిపోవడం వల్ల పాడయిపోయే సందర్భాలు కూడా ఉంటాయి. తిరిగి వాటిని పంచడం ఎంత శ్రమగా అనిపిస్తుంది! ఎంత పదార్థం, డబ్బు, సమయం వృథా.. దాదాపు మనమంతా ఎప్పుడో ఒకప్పుడు ఈ విధమైన ఇబ్బందికి గురయ్యే వుంటాము. బోలెడు సహజ వనరులు, ముడి సరుకు, సమయం డబ్బూ అన్నీ వృథా అయితే చాలా బాధగా వుంటుంది. మనలాంటి వర్ధమాన, అధిక జనాభా గల దేశాలకు భవిష్యత్తులో ఇది ప్రమాదకరమైన పరిణామాలకు దారి-తీయవచ్చు కూడా!

విదేశీయులు RSVP ను ఖచ్చితంగా పాటిస్తారు. అనేక విదేశీ పోకడలను మోజుగా మన సంప్రదాయాలలో కలుపుకుంటున్న మనం ఈ RSVP ను ఖచ్చితంగా అనుసరించాలి. ఈరోజుల్లో మనం పెళ్లిళ్లకు వెడితే పోటీ ప్రపంచానికి ధీటుగా 50, 60 పదార్థాలు పెడుతున్నారు. అతిథేయులు అన్ని అమర్చినా బారులు తీరిన జనం మధ్యలో, ఆడవాళ్ళయితే కట్టిన పట్టుచీరలు సర్దుకుంటూ, చంటిపిల్లల్ని ఎత్తుకుంటూ, ఆ పదార్థాలను రుచి చూడాలనే ఆత్రుతతో, అసౌకర్యంగా ఉన్నా, చెంచాలను ప్లేట్లకు కొట్టుకుంటూ (మనం పెట్టే బూరెలు, బొబ్బట్లు చెంచాలతో తినలేము). ఈ భోజనాల తంతులు చాలా వింత పోకడలకు దారితీస్తున్నాయి. నిజంగా నోట్లో నాలుగు మెతుకులు వేసుకోలేకపోవడం, అన్ని పదార్థాలు ఉన్నా కడుపు నిండా తినకుండానే బయటకి రావడం..పెద్ద సర్వసాధారణం అయిపోయింది. అలా తిరుగు ముహం పట్టగానే ఎక్కడో మనసు లోపలి పొరల్లో ఆ పాత మధుర జ్ఞాపకాలు పలకరిస్తుంటాయి. మనం చిన్నప్పుడు వెళ్ళిన పెళ్ళిళ్ళు.. ఆ బంతిభోజనాలు...సరదా కబుర్లు.... తాటాకు బుట్టలో అరిటాకులు



వేసి కూరలు, పులిహోర, ఒడుపుగా పట్టుకుని బాబయ్యలు, మావయ్యలు కొసరి కొసరి వడ్డించడం.. భోజనాల వేళ జరిగే వేళాకోళాలు... అల్లరి పనులు.. పెళ్లిపాటలు, కడుపు నిండా తిని త్రేంచుకుంటూ... తమలపాకులూ, వక్కా.. దట్టించి... పెళ్లి భోజనమా మజాకా .. చక్కగా ఉందర్రా.. అంటూ సంతోషంగా ఆశీర్వదించి వెళ్ళే పెద్దలు...ఇవన్నీ ఎలా మాయమయిపోయాయి అనిపిస్తుంది. ఇప్పటి రోజుల్లో అలా చేయడం...కష్ట తరమే కాని, అసాధ్యం మాత్రం కాదు. చక్కగా టేబుల్ మీల్స్ పెట్టినా, పిల్లలు, పెద్దలు సౌకర్యంగా కూర్చుని... కడుపునిండా తింటారు. మనకి ఎప్పుడూ ఓ ట్రెండ్ సెట్టర్లు కావాలి. ఎవరైనా తిరిగి ఆ ప్రయత్నం మొదలుపెడితే అంతా చక్కగా దానిని అనుసరిస్తారు. ఇవన్నీ...ఖచ్చితంగా అటు అతిథేయులకు, ఇటు అతిథులకు... సంతోషాన్ని ఇవ్వాలి అంటే ..... మనమంతా తప్పకుండా RSVP ను పాటించాలి. ఎవరైనా ఫంక్షన్ కు పిలవగానే మనకు వీలవుతుందో లేదో చూసుకుని వారికి ఓ వారం ముందుగానే... మన స్పందన తెలియజేయాలి.

అతిథేయులూ, మనం తప్పకుండా రావాలని కోరుకుంటూనే .. మనం ఎంతమంది వస్తాము, అనే వివరాలు మెయిల్ లేదా మెసేజ్ ల ద్వారా, ఫలానా తేదీ లోగా చెప్పమని అనడంలో తప్పు ఏమాత్రం లేదు. అదేవిధంగా అతిథులు కారణాంతరాలవల్ల రాలేమని మెసేజ్ చేసినా ... తప్పుగా భావించక ... వారి ఇబ్బందులను గుర్తించాలి. ఇది ఇద్దరికీ చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.... ఇలా మెల్లి మెల్లిగా చిన్నా పెద్దా కార్యక్రమాలలో అతిథుల సంఖ్య ఖచ్చితంగా తెలియడం వల్ల.... భోజనాల వృథా ఉండదు....మిగిలిన పదార్థాలను అనాథాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు పంచడం మంచిదే.... కానీ.. పదార్థాల వృథా లేకపోతే, చక్కగా ఆ డబ్బుతో తాజాగా ఓ రోజు భోజన ఖర్చు.. మనం వారికి అందిస్తే... మరింత బావుంటుంది కదా...

అందుకే.. శుభలేఖ అందుకోగానే ... మన పనులను వాయిదా వేసుకుని ఆత్మీయులను ఆనందంగా కలుద్దాం... అతిథేయులకు మన స్పందన ఏదైనా ముందే తెలియజేద్దాం...... అభ్యుదయ భారత దేశంలో... మనం జరుపుకునే వేడుకల్లో ... ఈ RSVP స్పందన విప్లవాత్మకంగా రావాలి.

ఇది అతిథికి, అతిదేయునికి మాత్రమే కాదు .... దేశానికీ, దేశ అభివృద్ధికీ ఎంతో మంచిది.

మరో అంశంతో మళ్ళీ కలుద్దాం.

జైహింద్

భారతీశర్మ

## రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంపవలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వబడును.

- సంపాదకురాలు


చైతన్యం సంకల్ప బలం

## చందా రేట్లు

| | |
|---|---|
| విడిప్రతి | రూ. 20.00 |
| సంవత్సరానికి | రూ. 200.00 |
| పోస్ట్ ద్వారా | రూ. 230.00 |

Please deposit your subscription in favour of
**CHAITANYAM SANKALPABALAM**
**A/c No. 1626201002070 - Canara Bank**
Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:

చైతన్యం సంకల్ప బలం

**Chaitanyam Sankalpabalam,**
**45058, Janapriya Utopia,**
**Hyderguda, Attapur**
**Hyderabad - 500 048**

**Email: teega51@gmail.com**
**Visit: www.chaitanyam.net**

# పాలెపు బుచ్చిరాజు



## బొమ్మలు చెప్పిన బాలల కథలు

(గత సంచిక తరువాయి)



అది గమనించిన పద్మావతి, బాధకి కారణం ఏమిటని అడిగింది. అప్పుడు రాజకుమారుడు ముందునుంచి జరిగిన కథనంతా వివరించాడు. అది విని మంత్రి కుమార్తె, “అయ్యయ్యో! అంతటి ప్రాణసఖుడిని ఒంటరిగా వదిలి పెట్టి ఇంతకాలం ఎలా ఉండ గలిగేవు? “ అని, పాయసం , అన్నం, నెయ్యి, తీసుకొచ్చి అతనికి ఇచ్చి రమ్మని పంపించింది. వజ్రముకుటుడు ఆమె మంచి మనసుని మెచ్చుకుని, వాటిని తీసుకుని వెళ్లి, మిత్రుడికి తినమని ఇచ్చాడు. విషయం అర్థం చేసుకున్న బుద్ధిశరీరుడు, “అయ్యో! వెర్రివాడా! అసలు నువ్వు నా విషయం ఆమెకు చెప్పకుండా ఉండవలసింది. సహజంగా స్త్రీలు అసుయాగ్రస్తులు. నీకు ఇంత ఆత్మీయుడైన స్నేహితుడు ఉన్నవిషయాన్ని ఆమె అరిగించుకోలేదు. చూడు. ఇది నాకోసం ఇచ్చిన విందు భోజనం కాదు. విషాన్నం.” అంటూ ఆ పాయ-

సాన్ని ప్రక్కనే ఉన్న ఒక కుక్కకి వేశాడు. అది తిని కుక్క అక్కడి-కక్కడే చచ్చి పోయింది. వజ్రముకుటుడి ఆశ్చర్యానికి అంతులేదు. జరిగిన దానికి విచారించవద్దని చెప్పి, "ఇప్పు నువ్వు తిరిగి అంతః-పురానికి వెళ్లి, అంతా ఆమె చెప్పి-నట్టే చేశానని చెప్పు. ఆమె మంచి నిద్దట్లో ఉండగా సమయం చూసుకుని, ఆమెకు తెలీకుండా ఆమె తొడల మీద మూడు చోట్ల నీ గోళ్ళు గట్టిగా నాటేటట్లు గంటులు పెట్టు. ఆమె కాలి అందియ నొక-దానిని సంపాదించి, నాకు తీసు-కొచ్చి ఇయ్యి. మిగతా పని నేను చూసుకుంటాను" అన్నాడు.

వజ్రముకుటుడికి అంతా అయోమయంగా ఉంది. అయినా మిత్రుడు తన క్షేమం కోరేవాడు కాబట్టి అతను చెప్పిన-ట్టే చేయాలని నిర్ణయించుకున్నా-డు. అందె తీసుకుని మిత్రుడు రాగానే, ముందుగా వేసుకున్న పథకం ప్రకారం వారిద్దరూ సన్న్యా-సుల వేషాల్లో త్రిశూలాలు పట్టు-కుని శ్మశానంలో ఉండ సాగారు.

ఇలా ఉండగా ఒకనాడు కర్ణోత్పలుడి కొడుకు చచ్చి పోయాడని తెలిసింది. అది విని మంత్రికుమారుడు అందెని రాకుమారుడికి ఇచ్చి, "దీనిని నువ్వు సంతలో అమ్మ-జూపు. కాని నిజంగా అమ్మ వద్దు. ఎవరైనా దీనిని ఆనవాలు పట్టి, నీకెక్కడిదని అడిగితే, నా గురువు గారు ఇచ్చారని, వారిని నా దగ్గరి-కి తీసుకునిరా! మిగతా కథ నేను నడుపుతాను." అన్నాడు. ఇదేదో కొత్తవింతలా ఉందే అని విస్తు-పోయినా, రాకుమారుడు, మి-త్రుడిని ప్రశ్నించకుండా అతను చెప్పినట్టే చేశాడు.

ఆ అందెను చూసిన ఒక దాసీది, దానిని రా-కుమార్తె పద్మావతి అందెగా



ఆనవాలు పట్టి, అతన్ని తీసికెళ్ళి మంత్రి దంతఘట్టకుడి ముందు నిలబెట్టింది. అది దొంగ సొమ్ము కాబట్టి, ఆయన, రాకుమారుడి-ని రాజసభలో నిలబెట్టి న్యాయం చేయమని కోరాడు. న్యాయాధి-కారుల ప్రశ్నలకి సమాధానం-గా వజ్రముకుటుడు, తనకి ఆ ఆభరణాన్ని తన గురువుగారు ఇచ్చారని, ఆయన శ్మశానంలో ఉన్నారని చెప్పాడు. రాజుగారు ఆ సన్న్యాసిని తీసుకురమ్మని భటుల్ని పంపించారు. బుద్ధిశరీరుడు ఈ పరిణామాన్ని ముందుగానే ఊహించాడు. కాబట్టి, "మేము సన్న్యాసులము. రాజాస్థానాలకి రాము. మీ రాజుగారినే ఇక్కడికి రమ్మని చెప్పం"డని వారిని వెనక్కి పంపించేశాడు.

ఇది మరీచోద్యం-గా ఉందే! అని రాజు స్వయంగా శ్మశానానికి వచ్చాడు. అప్పుడు దొంగ సన్న్యాసి రాజుతో ఇలా అన్నాడు. " రాజా! ఈ మంత్రి గారి కుమార్తె ఢాకిని అయి, సగం రాత్రి సమయంలో ఈ శ్మశానంలో దిగంబరంగా తిరుగుతోంది. గతరా-త్రి నీ కొడుకుని ఈమే చంపింది. ఈమె పారిపోతుండగా నేను కా-లుపట్టుకుని ఆపబోయాను. కాని ఆమె అందకుండా పారిపోయిం-ది. పెనగులాటలో నా త్రిశూలం ఆమె తొడమీద తగిలింది. ఈ అందె నా చేతిలోకి వచ్చింది. నీ కొడుకుని బలితీసుకున్న ఈమెకు దేశ బహిష్కారం శిక్షవేయించ-మని నా ప్రార్థన." తరవాత రాజు ఆజ్ఞాపించగా, దాసీలు ఆమె తొడ పరీక్షించి, త్రిశూలపు గాట్లు ఉన్న-విషయం నిజమే అని తేల్చారు. నేరం రుజువు అయింది కాబట్టి పద్మావతికి దేశ బహిష్కారం శిక్ష విధించారు.

ఇంత అవమానం జరిగాక బ్రతకడం వ్యర్థం అని పద్మావతి ఆత్మ హత్య చేసుకోబోయింది.

(ఇంకా వుంది)


# పోడూరి శ్రీనివాసరావు



## ఒక చెదరని స్వప్నం

"కల చెదిరింది
కథ మారింది
కన్నీరే మిగిలింది"
ఇది ఒక సినీ కవి ఆవేదన!
చెదరని కలతో
కథ మారదు
కన్నీరు కారదు ...
కానీ కథ వింతపుంతలు త్రొక్కుతుంది...
కన్నీరు కారదు పన్నీరు... చిలుకుతుంది..
చెదిరిన కల నీటిమీద రాతైతే
చెదరని కల...శిలాశాసనమే!
చెదిరిపోయే రాతల కన్నా
చెదరని రాతలు
హృదయాల్లో నిక్షిప్తమౌతాయి!
గుండెల్లో గూడు కట్టుకుంటాయి!!
మధురానుభూతులను
జీవితకాలమంతా
వెల్లివిరియచేస్తాయి..!!
చెదిరిన కల
కలత నిద్దురతోనే
కనుమరుగవుతుంది
ఆనవాలైనా మిగల్చకుండా
అదృశ్యమౌతుంది
కానీ... చెదరని కల అలా కాదు
ఉషః కాంతులతో మమేకమయి
నీ నిత్య కృత్యాలతో... తోడుంటుంది...
నీడలా నిన్ను వెంటాడుతుంది...
అనుభూతిని నీ జీవితంలో
ఆవహిస్తుంది....
కష్టమైనా - సుఖమైనా
ఆనందమైనా... ఆక్రోశమైనా...
కన్నీరైనా .... పన్నీరైనా...
నీ జీవన యాత్రలో భాగమౌతుంది
నీతోనే.... నడయాడుతుంది
కానీ...
అదేం వింతో... విచిత్రమో!
భగవంతుని సృష్టి విలాసం!!
చెదరని కల నీ బ్రతుకు చిత్రం
కేన్వాస్ పై గీసిన ఆయిల్ పెయింటింగ్ లాంటిది
అవే నీకు గుర్తుంటాయి కానీ....
చెదిరిన కలలు, వాటి నైజం
నీ జీవితంలో ఇంప్రెషన్స్
నింపాల్సి ఉన్నా ...
గుర్తుకు రావు...
చుట్టపుచూపుగా వచ్చి
పలకరించిపోయే
చెదిరిన కలలే -
నీతో ఆటలాడుకుంటాయి
చెదరని కలలు నీపై
ప్రభావం చూపగలిగేవైనా -
నీ వ్యక్తిత్వంపై గురిచూసి కొట్టగలిగేవైనా -
నీ జీవనయానంలో చుక్కాని పాత్ర పోషించేవైనా
చెదిరిన మబ్బుల్లా చెల్లాచెదరవుతుంటాయి
ఆ మబ్బులను
నీ జీవనరాగ గానంతో
ఆకర్షించి, దరి చేర్చి...
వానలను కురిపించిననాడే
ఆ చిరుజల్లుల చల్లదనాన్ని
ఆస్వాదించగలుగుతావు
మట్టి వాసనను ఆఘ్రాణించగలుగుతావు!
నీకొచ్చే కలలను
చెదిరిపోయేలా చేయాలన్నా
చెదరకుండా, ఉండేలా చేయాలన్నా
చెల్లాచెదరైన కలల మబ్బులను
మేఘావృతం చేసి.. చిరుజల్లులను
కురిపించేలా చేసుకోవాలన్నా....
నీ చేతుల్లోనే ఉంది!
నీ చేతలను, తలపులను...
ఒకటిగా చేయి
మమేకత్వంతో మైమరిచేలా చేస్తే
నీ జీవితమే నందనవనం -
దానికో పరమార్థం -
చెదరని కలలను లక్ష్యం చేసుకో!
లక్ష్యం ఛేదించటానికి కృషి చేయి
శిలాశాసనం- చెదరని కల ఒకటే
సాధించు... లక్ష్యాన్ని ఛేదించు
అంతిమ విజయం నీదే!!!

# డా.కవన శర్మ



## రసాయన శాస్త్రం

5. సమ సంఖ్యాకులు (Isotopes ) - కిరణ వ్యాప్తి ( Radiation )

### 5.1 సమ (పరమాణు) సంఖ్యాకులు (Isotopes)

పరిశుద్ధమైన కర్బనము, క్లోరిన్ మొదలైన కొన్ని మూలకాల మచ్చుల్లో , ఒకే పరమాణు సంఖ్య కలిగినప్పటికి భిన్న పరమాణు ద్రవ్యము ( సంఖ్య ) లు కల పరమాణువులు ఉండటాన్ని శాస్త్రజ్ఞులు గమనించారు. అంటే ఒకే పరమాణు సంఖ్య కలిగి ఉన్న ఒకే మూలకం యొక్క పరమాణువు కొన్నిసార్లు బిన్నమైన ద్రవ్యములు కలిగి ఉంటుంది అన్నమాట . అటువంటి పరమాణువులకి సమ (పరమాణు) సంఖ్యా కులు అన్న పేరు శాస్త్రజ్ఞులు పెట్టారు. అదెలా సాధ్యం ? సమ సంఖ్యాకుల లో పరమాణు సంఖ్యలు ఒకటిగానే ఉన్నాయంటే వాటి పరమాణువులన్నింటి లోని ధవిణాలు( protons), ఋవిణాలు ( Electrons) ఒకే సంఖ్యలో ఉన్నాయన్న మాట . ఇంక తేడా ఎక్కడ ఉంటుంది ? కేంద్రం లోని తటవిణా( Neutron ) ల సంఖ్యలు తేడాగా ఉంటాయి . సమ సంఖ్యాకుల రసాయనిక గుణాలు ఒకటే . ఎందుకంటే వాటి ఋవిణాల సంఖ్య ఒకటే. అవి మిగతా మూలకాలతో రసాయనిక బంధాలని ఒకే విధం గా ఏర్పరుచుకోగలవు . కొన్ని భౌతిక గుణాలు, ద్రవ్య రాశి, చొరబాటుతనం ( Diffusion) లాంటివి మాత్రం వేరుగా ఉంటాయి .

చాల మూలకాలు , సహజం గా సమసంఖ్యాకుల మిశ్రమంగా, ఉంటాయి. అందుచేత ఈ మూలకాల ద్రవ్యంగా వాటి సగటు ద్రవ్యంనే తీసుకుంటాము ఉదాహరణకి క్లోరిన్, క్లోరిన్ 35, క్లోరిన్ 37 ల మిశ్రమంగా 75:25 నిష్పత్తి లో ఉంటుంది . కనక దాని సగటు ద్రవ్యం35.5. ఈ సగటు ద్రవ్యాన్ని సాపేక్ష ద్రవ్యం అంటాం .

### 5.2 కిరణ వ్యాప్తి ఉన్న సమసం

ఖ్యా కులలో, అతి తక్కువ తట విణాల సంఖ్య కలిగినదాని కేంద్ర కం స్థిరంగా ఉండగా అంతకం టే ఎక్కువ సంఖ్య లో తటవిణాలు కలిగిన కేంద్రకాలు కొన్ని అస్థిరంగా ఉండి అవి తమంత ట తామే విచ్ఛిన్న మవుతూ ఉంటాయి . దీనిని అణువిక విచ్ఛిన్నత (Atomic Fission) అంటారు. ఈ చర్యలో శక్తి విడుదల అవుతుంది . ఆ సమ యం లో కొన్ని రకాల కిరణాలు ప్రసారమవుతాయి. ఈ విధంగా కిరణాలు ప్రసారం అవటాన్ని కిరణ వ్యాప్తి క్రియ లేక వికిరణ క్రియ ( Radioactivity) అంటారు. ఇది అణు క్రియే కాని రసాయనిక క్రియ కాదు .

ఈ అణుక్రియ లో వెలువడే కిరణాల నైజాన్ని బట్టీ, అవి చొచ్చుకు పోగల శక్తి ని బట్టీ వీటిని 3 రకాల కిరణాలుగా (ఆల్ఫా, బీటా, గామా, కిరణాలుగా) విభజించారు .


### 5.3 దూరుడు( Penetration ) శక్తి

పైన చెప్పిన మూడు కిరణాలకి పదార్థాలలో దూరగల శక్తి ఒకేలా ఉండదు .

ఆల్ఫా కిరణాల విడుదల పరమాణుసంఖ్య 83 కంటే ఎక్కువగా ఉన్న సమసంఖ్యాక మూలకాలలో జరుగుతుంది. వీటి కణాలు ధన విద్యుత్ ని కలిగి ఉంటాయి.ఈ కణాలు గాలిలో కొద్ది సెంటి మీటర్లు ప్రయాణించగలవు. కాగితం వీటిని అడ్డగించ గలదు .

బీటాకిరణాలు విడుదల పరమాణు సంఖ్య 83 కి సమానంగా కాని అంతకంటే తక్కువగా ఉన్న సమసంఖ్యాక మూలకాలలో జరుగుతుంది. వీటి కణాలు ధ్వనిణాలు. ఈ కణాలు గాలిలో కొద్ది మీటర్లు ప్రయాణించ గలవు. ఇవి కాగితంలో దూరగలవు. వీటిని పలచటి అల్యూమినియం రేకు అడ్డగించ గలదు

గామా కిరణాల విడుదల విడిగా కాక ఇతర రకాల కిరణాల జతలో జరుగుతుంది. ఇవి విద్యుత్ అయస్కాంత అలలు. ఇవి కణాలు కావు. ఇవి చాలా కిలో మీటర్లు ప్రయాణించ గలవు. వీటిని సీసం అడ్డుకోగలదు .




ఈ కిరణాలు ఏ పదార్థాలలో దూరి పోయి ప్రయాణిస్తాయో వాటి అణువుల పై ప్రభావం చూపిస్థాయి. ఇవి పరమాణువుల నుంచి ఋణిణాలను బయటికి కొట్టి (తన్ని ) ధన విద్యుత్ శకలా ( ధ్వనిశణాలు, positive ions) లని ఉత్పన్నం చేస్తాయి. అందుచేత వీటిని శకణ కిరణ వ్యాప్తి (Ionising radiation) అని కూడా అంటారు. ఇవి జీవ కణాలకి ప్రమాదకరం. వీటి వలన జీవకణాలు చావటం కాని, అధిక సంఖ్యలో విభజించుకుంటూ పోయి ( Cancer ) వ్యాధి కి గురి కావటం కాని జరగుతుంది.

## 5.4 కిరణ వ్యాప్తి వలన కొన్ని ఉపయోగాలు

1.రోగ కారక క్రిముల్ని చంపడానికి బీటా కణాలు వాడతారు


2.వైద్య అధ్యయన పరీక్షలకి ఐయోడిన్ 131 వాడతారు, X కిరణాలు వాడటం మనలో చాలా మందికి తెలుసు.

3. అధికసంఖ్యా విభజన జీవ కణాల్లో జర్గాతాన్ని ఆపటానికి కోబాల్ట్ 60, X కిరణాలు వాడతారు .అంటే కిరణ వ్యాప్తి వ్యాధిని కలిగించ చాగలదు, తొలిగించగలదు.

4. శిలాజాల కాలం నిర్ణయించటానికి కర్బనం 14 వాడతారు . ఇంతవరకు ప్రస్తుతం తెలుసుకుంటే చాలు . రసాయన శాస్త్రంలో ఇవి ఒకొక్కటి ఒక పెద్ద శాఖ

( ఇంకా వుంది )

**Penetrating power of different types of radiation**



# నండూరి సరోజాదేవి



శీరియల్

## మిస్ మేఘమాల IAS

(గత సంచిక తరువాయి)




ఆ రాత్రి అందరి భోజనాలు పూర్తి అయ్యాకా..తండ్రి గదిలోకి వెళ్లి, షాపింగ్ చేసినవన్నీ ఆయనకీ చూపించింది మేఘమాల!

"మేఘా!వాళ్లకి ఇవి అన్నీ తీసుకుని చాలా మంచిపని చేసావు. ఒకొక్కసారి మన వాళ్ళ మీద ఉండే ప్రేమని, అస్తమానూ మాటల్లోనే కాకుండా.. ఇటువంటి మర్యాదతో కూడిన సత్కారం చేయడంతో, అది మరింత ఎక్కువ అవుతుంది.”

“నిజంగా, ఇంత మంచి పద్ధతులు అలవడిన నిన్ను చూస్తుంటే .. సంతోషంగానే కాదు, చాలా గర్వంగా కూడా అనిపిస్తూ వుంటోంది అమ్మా" అని కూతురి అర చేతిని, తన చేతిలోకి తీసుకుంటూ అన్నారు శ్రీనివాసరావు గారు.

“అవి,నీ పెంపకం నుండి వచ్చినవే కదా డాడీ? ఆ గర్వమేదో నేను పడాలీ” అంటూ తనూ,తండ్రిని గట్టిగా పట్టేసుకుంది మేఘమాల.

"అమ్మ, మేఘా! అన్నట్టు, నీ ఆఫీసు కార్యక్రమాలు అన్ని పూర్తి చేసేసుకున్నావా? మన ప్రయాణం ఇంక ఎల్లుండే కదా?” శ్రీనివాసరావు గారు అడిగారు.

రేపటితో అయిపోతాయి డాడీ. ఇదిగో, ఈ పూటే ప్రయాణానికి కూడా అన్ని సద్దేసుకుని రెడీ చేసేసుకుంటాను!

“మీ పెట్టి కూడా సర్దేయనా డాడీ ?”అడిగింది మేఘమాల.

“అది నేను రేపు చూసుకుంటాను కానీ..వెళ్లి నీ పనేదో చేసుకుని, పెందరాళే పడుకో తల్లీ”అని శ్రీనివాసరావుగారు చెప్పగానే,మేఘమాల అక్కడ నుండి మేడ మీదికి వెళ్ళిపోయింది!

గౌరీ,వెనకాలే ‘ఆ బట్టల కవర్లు,బంగారం వస్తువుల బాక్స్ లను’ తీసుకుని, పైన మేఘమాల రూమ్ కి తీసుకువెళ్ళింది!

గౌరీ రాగానే ..తల్లి పక్కన ఒక్కసారి నడుం వాల్చిన మేఘమాల వెంటనే లేచిపోయి తన సూట్ కేసులు రెండు, ఒక బ్యాగ్ ని కూడా ఆ గదిలోకి తెప్పించుకుంది.

"అమ్మా! ఒక అరగంట సేపు పెట్టెల్లో బట్టలు సర్దుకు వస్తాను, లైట్ ఉంటే పడుకోవడానికి నీకేం ఇబ్బంది ఉండదు కదా?”తల్లిని అడుగుతూ మంచం దిగింది ఆమె.

“నాకేం పర్వాలేదు కానీ, పొద్దున్న నుండీ అలిసిపోయి ఉన్నావు. రేపు తీరుబడిగా సర్దుకోవచ్చు కదరా?”తనే కూతురితో అంది అన్నపూర్ణమ్మగారు.

"కుదరదమ్మా,రేపు ఆఫీస్ పన్లు చాలా ఉన్నాయి.ఇంక మన ఊరి ప్రయాణం ఎల్లుండే కూడా"అంటూ బీరువా తెరిచి,ఊరికి తీసుకువెళ్లే బట్టలు సెలెక్ట్ చేసుకుంటూ తీసి గౌరికి అందించసాగింది మేఘమాల.

"నేను కూడా సర్దిపెట్టనా?"అప్పటి వరకు వాళ్ళ మాటలు వింటూ పడుకున్న మాలతి, మేఘమాలని అడిగింది.

"ఆ అడగడం ఏంటమ్మా? లేచి వెళ్లి సాయం చేయి"అని తల్లి నుండి ఆ సమాధానం రావడంతో, మాలతి కప్పుకున్న దుప్పటీని పక్కన పడేసి వెంటనే మంచం మీంచి దిగింది.

"నువ్వేం హెల్ప్ చేయక్కరలేదు కానీ, హాయిగా పడుకో" అంటూ మాలతిని వారించింది మేఘమాల.

"ఏం కాదులే అమ్మా, ఇద్దరు కలిసి చేస్తే ఆ పని కూడా తొందరగా తెముల్తుంది కదా?" అని నొక్కి చెప్పింది అన్నపూర్ణమ్మగారు.

"అదేదో గౌరీ చేస్తుంది కానీ.. అన్నట్టు, మాలతీ! అమ్మకి మనం కొన్న గోల్డ్ చూపించలేదు కదా? గాజులు,గొలుసు ఒకసారి వేసి చూపించు, సరదాగా చూద్దాం", చేస్తున్న పని ఆపి, ఆ బాక్సులు మాలతికి ఇచ్చింది మేఘమాల.

"అవునమ్మా! మనం అప్పుడే ఎలాగూ పడుకోము కదా, ఒకసారి లే..మనకి కొన్న నగలు చూద్దువు గానీ" అని తల్లితో అంది మాలతి.

"బాగుందర్రా! అర్ధరాత్రప్పుడు మీ ఈ పనులు, ముచ్చట్లూనూ?" అంటూ ..ఇంక కూతురు చేయి అందించడంతో, తప్పదన్నట్టు లేచి కూర్చుంది అన్నపూర్ణమ్మగారు.

ముందు తన చేతులకి కెంపు గాజులు నాలుగూ వేసుకుని .."ఇదిగోమ్మా!" అంటూ తల్లికి చూపించింది మాలతి.

అన్నపూర్ణమ్మగారు గాజులుని పరీక్షించి మరీ చూసి.."చాలా బాగున్నాయి తల్లీ!" అని మేఘమాల వైపుకి చూసి చెప్తూనే, ఆ రెండు చేతులని ముద్దాడి తన సంతోషాన్ని వ్యక్తం చేసింది.

"ఇంకిప్పుడు నువ్వేసుకుని చూపించూ" మేఘమాల చీరలు పెట్టెలో పెట్టుకుంటూనే, తల్లితో అంది.

మాలతి పలకసర్ల గొలుసుని,-తీసి తల్లి మెడలో వేసి.."మేఘమాలా! ఇదిగో, చూడు" అంటూ చెప్పింది.

మేఘమాల వెంటనే అక్కడికి వెళ్లి, తల్లి మెళ్ళో ఆ కొత్త గొలుసుని కళ్ళు ఇంత చేసుకుని చూస్తూనే..

"అమ్మా! నీ మెడలో ఈ గొలుసు ఎంత బాగుందో చెప్పలేను.నీ అందం మూలంగా, గొలుసుకే మరింత రాణింపు వచ్చిందేమో అనిపిస్తోంది.. కదూ మాలతీ?", అనంటూనే, తల్లి బుగ్గ మీద ముద్దు పెట్టింది.

"పెద్దమ్మగారు అంత అందంగా ఉన్నారు కాబట్టే..మీ ఇరువురికి కూడా ఆ పోలిక వచ్చింది కదా అమ్మా?"అని మేఘమాలతో అంది గౌరి.

"నిజంగా మాలతి, నేను కూడా అంత బాగుంటామా గౌరీ?" అంటూ అమాయకంగా మొహం పెట్టి అడిగింది మాఘమాల.

"మీకేం తెలియనట్టు,నన్ను భలే అడుగుతున్నారు లెండి అమ్మా?" అంటూ గౌరీ మూతి ముడుచుకుంది.

"తెలియకేం కాదు అనుకో ..కానీ మా అందం గురించి, మేం చెప్పుకుంటే బాగుండదు కదా? అందుకే, నిన్నలా అడుగుతున్నాను.అవును కదు మాలతీ?" అంటూ ఆమె వంక చూసి,మేఘమాల చిన్నగా కన్నుకొట్టి అడగడమే తడవుగా..

వెంటనే వాళ్లిద్దరూ,పక పకా నవ్వేసు కోసాగేరు కూడా!

అది చూసి గౌరి ముందు కాస్త వుడుక్కున్నా..తరువాత వాళ్ళతో కలిసి, తనూ హాయిగా నవ్వేసింది!

"మేఘమాలా! ఆ బట్టలు సర్దుకోవడం అయిపోతే, ఇంక వచ్చి పడుకుండిపో తల్లీ" అంటూ కూతురికి చెప్పింది అన్నపూర్ణమ్మగారు.

"ఇంకొక్క ఐదు నిమిషాల్లో పూర్తి చేసేస్తాను అమ్మా!"

"రా,గౌరీ!" అంటూ మేఘమాల ఆ పని అవ్వగొట్టడానికి వెళ్ళిపో-

యింది.

0000000000

మర్నాడు ఉదయమే తన పనులు అన్నీ ముగించుకుని, మేఘమాల కలెక్టర్ ఆఫీస్ కి వెళ్లిపోవడం గమనించగానే..వినోద్ కూడా ఆ వెంటనే బయటకు బయలుదేరి వెళ్ళిపోయి, రాజవోలు ఊరులోని రాముకి ఫోన్ చేశాడు!

"రాము! మావయ్య ఎలా ఉన్నారు? మొన్న నేను చెప్పమన్న విషయాలు అన్నీ ఆయనకి చెప్పావు కదా?"అని అడిగాడు.

"నువ్వు చెప్పినట్టే చేశాను వినోద్. నిజంగా అప్పుడు ఆయన పొందిన ఆనందం చూసినప్పుడు, నాకే చాలా ఆశ్చర్యం అనిపించిందీ.అంతేకాదు! నువ్వు చెప్పిన విధంగా, ఆ మేఘమాల గారి విషయం నేను ఎంత రహస్యంగా వుంచబోయినా.."

మావయ్యగారు మాత్రం అది దాచకుండా, ఊళ్లోని ముఖ్యమైన వారందరికీ 'తనకి ఇంకో కవల పిల్ల కూడా ఉందనీ, తన స్నేహితుడికి పెంపకం ఇచ్చానని' అంటూ ఆ వివరాలన్నీ చెప్పడం మొదలెట్టారు.. వాళ్ళందరూ, 'తన కలెక్టరమ్మాయి కోసం ఎదురు చూస్తున్నారంటూ' దానికి మావయ్యగారు మరింత ఎక్కువ సంతోషంగా ఉన్నారు"అని జరుగుతున్నదంతా రాము చెప్పుకొచ్చాడు.

"బాగుందిరా! మావయ్యకీ చాదస్తం ఇంకా ఎక్కువైపోయినట్టుందీ? మేఘమాల వస్తున్న సస్పెన్సు ఆయన ద్వారానే లీక్ కూడా అయిపోయిందన్న మాటా?" అని నవ్వేస్తూ..

"రామూ! మేము గురువారం సాయంత్రం కాదు, గురువారం ఉదయానికి అక్కడ ఉంటాము" అని మావయ్యకి కబురు తెలియ చేయి. ఆయన వెనకే వుండి, ఏ సహాయం కావాలన్నా మాత్రం చూడు", అని వినోద్ ఆ ఫోన్ ముగించేశాడు.

000000000

అనుకున్నట్టుగానే బుధవారం రోజు రాత్రి..మేఘమాల కుటుంబ సభ్యులందరూ ఊరు వెళ్ళడానికి రైలు ఎక్కేసారు!

"మేడం! ఈ రోజు ఉదయమే మీ కారులో అసిస్టెంట్ కిరణ్, సెక్యూరిటీ విల్సన్ కూడా వెళ్లినట్టు నాకు ఫోన్ చేసి చెప్పారు. కనుక రేపు రాజమండ్రి స్టేషన్ దగ్గర వాళ్లు, మీ కోసం రెడీగా ఉంటారులెండి, అప్పటి దాకా నేను ఫాలో అప్ చేస్తూ వుంటాను" వినయంగా చెప్పారు శ్రీధర్.

"చాలా థాంక్స్ శ్రీధర్. మా కారు ఎలాగూ వస్తుంది కానీ, కిరణ్ వాళ్ళ అవసరం లేదంటే, మీరు వినటం లేదూ. పోనీలెండీ! నాతో పాటు వాళ్ళూ మా ఊరు చూస్తారు" అంటూ చిన్నగా నవ్వింది మేఘమాల.

"అదేంటి మేడం,అలా అంటారు? అసలు గవర్నమెంట్ కారే మీరు తీసుకు వెళ్లాల్సి ఉందీ. వెంట కనీసం ఆ కిరణ్ వాళ్ళైనా ఉండకపోతే ఎలాగా?" శ్రీధర్ గారు సిన్సియర్ గా ఆ మాట చెప్పేశారు.

"నా సంగతి మీకు తెలుసు కదండీ, నా సొంత పనులకి ప్రభుత్వానివి వాడననీ?" తనూ అంతే ఖచ్చితంగా చెప్పింది మేఘమాల.

"మేడం! మీ ప్రిన్సిపుల్స్ తెలుసుకాబట్టే..కొన్ని తప్పని విషయాలలో మేము ఇలా కలగచేసుకోవలసి వొస్తోంది, ఇబ్బంది అయితే ఏమి అనుకోకండి."

"భలేవారే..ఎంతో బాధ్యతాయుతంగా, గౌరవంగా ఆలోచించే మీ విషయంలో నేను ఎప్పుడు ఏమి అనుకోను" అందామె వెంటనే.

"థాంక్స్,మేడమ్!" అంటూ తన కృతజ్ఞతని తెలియ చేశారు శ్రీధర్.

అలా ఎంతో నిజాయతీతో కూడిన, కూతురి అన్న మాటలు వింటుంటే అన్నపూర్ణమ్మ గారి మనస్సు ఆనందంతో నిండిపోయింది.

ఆ రైలు బయలుదేరబోతోందనే అనౌన్సుమెంట్ రాగానే.." మేడమ్! నేను ఇంక వెడతాను. అల్ ది బెస్ట్, హ్యాపీ గా వెళ్లి రండీ" అని మేఘమాలకి విషెస్ తో పాటు, వినోద్ వాళ్లకి కూడా చెప్పేసి శ్రీధర్ అక్కడ నుండి వెళ్లిపోయారు.

( ఇంకా వుంది )

# శ్రీనాధుని కాశీ ఖండం

## (వచనానుసరణం)


## పోచినపెద్ది మురళీ కృష్ణ




### ముందు మాట

కాశీ క్షేత్రంతో భారతీయులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది.. జన్మించినా, మరణించినా కాశీ క్షేత్రంలోనే జరగాలని భారతీయులు భావిస్తారు. అంతటి పవిత్ర క్షేత్ర వైభవాన్ని వర్ణించని భారతీయ సాహిత్యం లేదు. స్కాంద పురాణంలో వ్యాసుడు కాశీ వైభవాన్ని విస్తృతంగా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో శ్రీనాధుడు ప్రప్రధమంగా ప్రబంధ రీతిలో కాశీ క్షేత్రాన్ని వర్ణించాడు. ఈ కాశీ ఖండాన్ని మా పాఠకులకు పరిచయం చేయడానికి డా. పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారిచే సరళ వ్యావహారిక భాషలో, యధా మూలానుసారంగా అనుసరించిన కాశీ ఖండాన్ని, నెలనెలా అందిస్తున్నాము.

ఈ వ్యాస పరంపర ఆధ్యాత్మిక వేత్తలకు భక్తీ తత్వాన్ని, విద్యార్థులకు శ్రీనాధుని తత్వాన్ని అందించగలదని భావిస్తున్నాము.

- సంపాదకురాలు.


(గత సంచిక తరువాయి)


" వింధ్య పర్వతంమీద ఒక చిన్నది మనలను ఎదిరించుటకు సిద్ధముగా ఉన్నది. మీరు వెళ్ళి ఆమెను ప్రాణాలతో బంధించి తీసుకు రండి. తామర పూవువలె అందమైన కనులు కలది, సంపెంగ పూవు వలె కోమలమైనది. ఆమెను వధించుట తగదు. ఆమెను మోసగించి కాని బంధించి కాని , బతిమాలిగాని తీసుకు రండి. ఆమె కందకుండా, వాడకుండా, తీసుకురండి. అమెను కందకుండా ఎవరు తీసుకు వస్తారో వారికి పారితోషకముతోబాటు ఇంద్ర రాజ్య పదవిని ఇస్తాను. దీనికి ఇక్కడ ఉన్న అందరు సాక్షి. శీఘ్రముగా తిరిగి రండి" అని దుర్గాసురుడు ఆదేశించాడు.

ఆ మాటలు వినగానే ప్రళయ కాలంలో సముద్రం చెలియల కట్ట దాటినట్లుగా రాక్షస సైన్యం వింద్య పర్వతానికి చేరుకుంది. శంఖ, భేరి, పటహ, కాహళీ,-ధ్వనులుభూనభోంతరాలుమార్మోగుతున్నాయి. భూ మండలం కదులు న ట్లు గా సై న్యం న డుస్తోంది.

శక్తి, రాక్షసులుద్వందయుద్ధంప్రారంభించారు. అనేక రకాలయిన ఆయుధాలు ప్రయోగిస్తున్నారు. వీరి ద్వంద యుద్ధము అందరిని ఆశ్చర్యపరుస్తోంది.

త్రైలోక్య విజయతో దుర్ధరుడు, తారతో దుర్ముఖుడు, జయతో ఖరుడు, త్రైలోక్య సుందరితో సీరపాణి, త్రిపురతో పాశ పాణి, త్రిజగన్మాతతో సురేంద్రుడు, త్రిపుర భైరవితో దేవకంఫనుడు, కామాక్షితో ఖడ్గ రోముడు, కమలాక్షితో వజ్రపాణి, త్రిపురతాపనితో పింగళాక్షుడు, జయంతితో కుక్కుటాస్యుడు, విజయతో కపింజులుడు, అపరాజితతో వక్త్రుడు, శంఖినితో ఘూకరవుండు, గజవక్త్రతో శంఖకర్ణుడు, మహిషఘ్నితో జలంధరుడు, రణప్రియతో బకుండు, శుభానందతో కిమ్మీరుడు, కోట-

రాక్షితో ధూమ్ర వర్ణుడు.శివారావతోధూమ్రాక్షుడు, త్రినేత్రతో పింగాక్షుడు,ఘోరయుద్ధాన్ని చేసారు.

ఆ సమయంలో శక్తులు, రాక్షసులు విడిచిపెడుతున్న వింటినారి శబ్దాలు వింధ్య పర్వత రాజ మార్గంలో ను, భూనభోంతరాళలలోను ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆయుధాలు నాలుగు విధాలు. అవి ముక్తాముక్తములు, కరముక్తములు, యంత్ర ముక్తములు, అముక్తములు. రాక్షసులు ఈ నాలుగు ఆయుధములతో శక్తులతో పోడారుతున్నారు.

శక్తి, రాక్షసులు పోరాడుతున్నప్పుడు వారి విల్లులనుండి క్షురప్రములు, పారములు, మహాభల్లములు, శిలీ ముఖములు, అంజలికములు, నారాచములు, అర్ధచంద్రములు అను బాణములు వెలువడుతున్నాయి. ఈ బాణాలు పగలుకూడా చీకట్లను సృష్టిస్తున్నాయి.

ఈవిధంగా యుధం జరుగుతుండగా “ వింధ్యవాసిని” వాయురూపాన్ని ధరించి రాక్షసుల ఆయధాలను ఎగరగొట్టింది. రాక్షసులు నిరాయుధులై పాఱిపోయారు.

దుర్గాసురుడు వింధ్యవాసినిని సమీపించి తనదగ్గర ఉన్న శక్తి ఆయుధాన్ని ప్రయోగించాడు. వింధ్యవాసిని తన శక్తిని ప్రయోగించి దుర్గాసురుని ఆయుధాని ముక్కలు ముక్కలుగా ఖండించింది. రాక్షసుడు చక్రాన్ని ప్రయోగించాడు. పార్వతి తన చక్రాన్ని ప్రయోగించి ఆ చక్రాన్ని ఖండించింది. రాక్షసుడు విల్లు ఎత్తగా పార్వతి తుంచి వేసింది. శూలమెత్తగా నీలవేణి ఖండించింది. గదను ఎత్తగా ఆమె బద్దలు చేసింది. ఖడ్గాని ఎత్తగా ఆమె ముక్కలు ముక్కలుగా చేసింది. రాక్షసుడు వింధ్యవాసిని సంహరించుటకు బండరాతిని ఎత్తుకొని వేగముగా వస్తున్నాడు . పార్వతి ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించింది. దుర్గాసురుడు నేలకొరిగిపోయాడు. దేవతలందరు పార్వతిని ఈ విధంగా స్తుతించారు.



## దేవతలు పార్వతిని స్తుతించుట

“ దేవీ! జగద్ధాత్రీ ! జగత్రయా జననీ ! మహేశ్వరీ! మహా శక్తీ! దైత్యద్రుమ కుఠారికా ! త్రైలోక్య వాసినీ ! శివా ! శంఖ చక్ర గదా శార్ఙ్గ ధారిణీ ! విష్ణు స్వరూపిణీ ! హంస యాన ! సర్వ సృష్టి విధాయినీ ! అనాదినిధన వాగ్జన్మ భూమి ! చతురానన ! ఐంద్రీ ! కౌబేరీ ! వాయవీ ! వారుణీ ! యామినీ ! నైరృతీ ! ఐశీ ! పావకీ ! శశాంక కౌముదీ ! సౌరీ ! సర్వ దేవ మయీ ! పరమేశ్వరీ ! గౌరీ ! సావిత్రీ ! గాయత్రీ ! సరస్వతీ ! ప్రకృతీ ! మతీ ! అహంకృతీ ! బ్రహ్మాండాంతస్థ ! మహాదేవీ ! పరా ! అపరా ! పరాపరా ! పరాపర పరమ పరమాత్మ స్వరూపిణీ ! సర్వ స్వరూపా ! సర్వగా ! చిచ్ఛక్తీ ! మహా మయా ! స్వాహా ! స్వధా ! శ్రౌషడ్వౌషట్ స్వరూపిణీ ! ప్రణవాత్మికా ! సర్వ మంత్ర మయీ ! చతుర్వర్గాత్మికా ! చతుర్వర్గ ఫలోదయా !” అని అనేక విధములుగా దేవతలు స్తుతించారు.

భద్ర కాళి దేవతలకు కోరిన వరాలను ప్రసాదించింది. దుర్గాసురుని సంహరించి లోకముల దుర్గతిని మాన్పుటవలన ఆమెకు

దుర్గ అని పేరు వచ్చింది.

దుర్గా దేవి కాశీ నగరం లో ఉత్పాతము మొదలయిన దోషాలు రాకుండా చూస్తుంది. అక్కడ ఉన్న దుర్గా కుండంలో స్నానం చేసినట్లయిన దుర్గతుల- నుండి విముక్తి లభిస్తుంది. దు- ర్గాదేవి శరీరమునుండి జన్మిం- చిన శక్తులు కాశీ నగరం పంచ క్రోశ పరిమితిలో దూషణ కలుగ- కుండా చూస్తాయి.

శతనేత్ర, సహస్రాస్య, అయుత భుజ , అశ్వారూఢ , గజాస్య , త్వరిత , శవవాహిని , విశ్వసౌభాగ్య , గౌరి అను వారిని నవ శక్తులు అని పిలుస్తారు. రురుండు , చండుడు , అసి- తాంగుడు , కపాలి , క్రోధనుడు , ఉన్మత్త భైరవుడు , సంహారుడు , భీషణుడు , అనువారిని అష్ట భైరవులు అని పిలుస్తారు. వి- ద్యుజ్జిహ్వుడు , లలజ్జిహ్వుడు , క్రూరాస్యుడు , క్రూర లోచనుడు , ఉగ్రుడు, వికట దంష్ట్రుడు , వక్రాస్యుడు , వక్ర నాసికుడు , జంభకుడు , జృంభకుడు , జ్వాలా నేత్రుడు , వృకోదరుడు , గర్త నేత్రుడు , మహా నేత్రుడు , తుచ్ఛ నేత్రుడు , ఆంత్రమండనుడు , జ్వలత్కేశుడు , కంబు శిరుడు , పృధు గ్రీవుడు , మహా హనుడు , మహా నాసుడు , లంబ కర్ణుడు , కర్ణ ప్రావరుణుడు , మొదలయిన భేతాళులు అనేకమంది ఉన్నారు. కాశీ నగరంలో లెక్కలేనన్ని



భూతాలు ఉన్నాయి. వీరందరు కాశీ నగరాన్ని రక్షిస్తూ ఉంటారు. అని కుమారస్వామి అగస్త్యునికి చెప్పాడు.

" కాశీ నగరంలో దివ్య లింగాలు ఎన్ని ఉన్నాయి? వాటి మహిమలు ఎటువంటివో తెలు- పుమని" అగస్త్యుడు కుమారస్వా- మిని ప్రార్థించాడు. పార్వతీదేవికి పరమేశ్వరుడు చెప్పిన వృత్తాంత- మంతా కుమారస్వామి అగస్త్యు- నికి ఈ విధంగా చెప్పడం ప్రారం- భించాడు.

## ఓంకారేశ్వర మహాత్మ్యము

ఆనంద వనంలో బ్రహ్మ తపస్సు చేయడం ప్రారంభించాడు. ఆ తపస్సు వేయి సంవత్సరాలు గడిచింది పోయింది. ఒకరోజున పాతాళ లోకంనుండి దివ్య తే- జస్సుతో కూడిన దివ్య లింగము పైకి లేచింది. బ్రాహ్మ మనోవీధిలో భావించినట్లుగా ఆ శివలింగము సూర్య కాంతితో ప్రకాశిస్తోంది. శివలింగం ఆవిర్భవిస్తున్నప్పు- డు ఛట ఛట శబ్దములు వెలు- వడుచున్నాయి. ఆ శబ్ద ధ్వనికి బ్రహ్మ సమాధి స్థితిని విడిచిపెట్టి ఎనిమిది కళ్ళు విప్పి చూసాడు.

శివలింగంనుండి కాంతి కిరణాలు వెలువడుతున్నాయి. మొదటి వెలుగునందు విష్ణు- వుయొక్క ఆకార రేఖతో " అ" కారము కనబడినది. తరువాత బ్రహ్మరూపము దాల్చిన " ఉ" కారము ప్రత్యక్షమయినది. అటుతరువాత శివుని రూపము- దాల్చిన " మ" కారము ప్రత్యక్ష- మయినది. తరువాత శబ్ద బ్రహ్మ నాదము వినబడింది. ఆ నాద- మునందు భువనసృష్టి హేతువ- యిన బిందువు కనబడింది.

(ఇంకా వుంది)

# తుమ్మూరి రాంమోహన్ రావు



## నైమిశారణ్య యాత్ర

నైమిశారణ్య యాత్ర-6

నైమిశారణ్యంలో అతి ముఖ్యమైన ప్రదేశం చక్ర తీర్థం.ఈ క్షేత్రానికి నైమిశారణ్యం పేరు రావడానికి కారణం చక్రనేమి(చక్రము చుట్టూ ఉండే కమ్మి) అని చెప్పుకున్నాం కదా! నేమి పడినందు వల్ల నైమిశారణ్యమని అడవికి పేరు రావడం,చక్రం పడిన చోట జలకుండమేర్పడి చక్రతీర్థంగా ప్రసిద్ధి పొందడం జరిగింది. నైమిశారణ్యం మరియు చక్రతీర్థాల ప్రసక్తి స్కంధ పురాణం,బ్రహ్మ పురాణం,శివ పురాణం,బృహన్నారదీయ పురాణం,నృసింహ పురాణం,దేవీ భాగవతాల్లో వస్తుంది. అన్నింటిలోనూ ఈ క్షేత్ర మాహాత్మ్యం గురించి చెప్ప బడింది. ముఖ్యంగా కలియుగ ప్రవేశానికి ముందు మునులంతా వెళ్లి కలి ప్రభావం లేని చోటు చూపమంటే బ్రహ్మ

తనమనోచక్రాన్ని విసితే అది పడిన చోటునే తమ తపోభూమిగా ఎంచకున్నట్లు కూడా చెప్పుబడింది,ఏది ఏమైనా నైమిశారణ్యం ఒక పవిత్ర క్షేత్రంగా విలసిల్లుతున్నాయి.ఈ క్షేత్రంలోని ప్రధాన స్థలం చక్రతీర్థం. చక్రతీర్థంలో స్నానంచేస్తే పాపాలు తొలగటమేగాక వ్యాధులుకూడా నయమౌతాయని ప్రతీతి.ఇక్కడ పితృదేవతలకు పిండప్రదానం అనేక రెట్ల ఫలితముంటుదని చెబుతారు.

చక్ర తీర్థం వలయాకారంలో అందంగా నిర్మించబడిన కొలను లేదా గుండం.దాని మధ్యలో వలయాకృతిలో చిన్న గోడ నిర్మించ బడి ఉంది.గోడలోపల వెలుపల నీళ్లు ఉంటాయి.చుట్టూ జగడానికి మెట్లు ఉంటాయి.నీళ్లు స్వచ్ఛంగా ఉంటాయి.అందులో స్నానం చేయడం ఒక గొప్ప అనుభూతిని కలిగిస్తుంది.ఆబాలగోపాలం కేరింతలు కొడుతూ స్నానం చేయడం చేస్తుంటే మనల్ని మనంమరచిపోతాం.ప్రతి రోజూ సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో తీర్థంలో ఇచ్చేహారతి చేసి తీరాల్సిందే.చక్రతీర్థం చుట్టూ ఎనిమిది దిక్కులలో ఎనిమిది వేదికలపై చేతులలో. దీపాల సెమ్మెలు పూని ప్రత్యేక వస్త్ర ధారణతో అర్చకయువకులు హారతిని అత్యంత భక్తి శ్రద్ధలతో ఇవ్వడం కడు శోభాయమానంగా ఉంటుంది

నైమిశారణ్య యాత్ర-7

వేదవ్యాసుడు పురాణాలను రచిస్తే,సూతుడు శౌనకాది మునులకు చెప్పాడు.

పద్దెనమిది పురాణాల పేర్లు వరుసగా:

మత్స్యపురాణం,కూర్మపురాణం, వామన పురాణం, వరాహ పురాణం, గరుడ పురాణం, వాయు పురాణం, నారద పురాణం, స్కాంద పురాణం, విష్ణుపురాణం,భాగవత పురాణం,అగ్నిపురాణం,బ్రహ్మపురాణం, పద్మపురాణం, మార్కండేయ పురాణం,-బ్రహ్మవైవర్త పురాణం, లింగపురాణం, బ్రహ్మాండ పురాణం, భవిష్య పురాణం.

వీటిలోమార్కండేయ పురాణం చిన్నది కాగా, పద్మపురాణం పెద్దది.ఏ పురాణంలో ఏముందో తరువాత తెలుసుకుందాంఇవన్నీ ఇక్కడ రచింప బడి,ప్రవచింపబడినవి కనుకనే ఈ స్థలం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రమయ్యింది.నైమిశారణ్యంలో చూడవలసిన ముఖ్య మైన ప్రదేశాల్లో వ్యాసగద్దె ఒకటి.వ్యాసగద్దె అని పిలువబడే ఈ చోటు ఊళ్లోనే ఆగ్నేయది-

శలో గోమతిని ఆనుకుని ఎత్తైన ప్రదేశంలో ఉంది. మెట్లు కలిగి సిమెంటుతో విశాలమైన వటవృక్షం క్రింద నిర్మించబడిన అయి పెద్ద గద్దె ఇది.వట వృక్షచ్ఛాయలో చిన్న మంటపం,అందులో అందమైన వేదవ్యాస మహర్షి శిల్పం చూడగానే ఎంత ప్రశాంతత చేకూరుతుంది.ఇక్కడనేకదా మన ఆధ్యాత్మిక భావ సంపద పురుడు పోసుకున్నదిఅనే ఆలోచన ఆ ప్రదేశంమీద ఎక్కడలేని ఆరాధన భావాన్ని కలుగ చేస్తుంది.ఇప్పుడు కొంత ఆధునికతను సంతరించకున్నా వాతావరణంలో
ప్రశాంతత అలాగే ఉందనిపిస్తుంది.చెట్టు వెనుక వైపు మరి కొంచం ఎత్తులో వ్యాసునికి-,సూతుడికి
నిర్మించిన ఆలయం ఉంది. అక్కడ నిలబడి చూస్తే
దిగువన గోమతి కనిపిస్తుంది.
వట వృక్షం క్రిందనే కుడివైపు యజ్ఞశాల ఉంది.మునులు క్రతువులు జరిపిన పవిత్ర స్థలంగా పేర్కొంటారు.
వ్యాసగద్దెకెదురుగా స్వయంభువు మనువు మందిరం ఉంది. ఇక్కడి కట్టడాలన్నీ ఉత్తర భారత సంప్రదాయంలో నిర్మించబడినవే.దాదాపు అన్ని చోట్లా పాలరాతి విగ్రహాల కనిపిస్తాయి.మానవుల పుట్టుకకు మూలాధారంగా స్వాయంభువ మనువు దంపతులను చూపిస్తారు.వ్యాసవేదిక వద్ద ప్రశాంత వాతావరణం మనలను బాగా ఆకట్టుకుంటుంది.బలవంతంగా అక్కడినుండి కదలి రావలసి వస్తుంది.ఆధునికత సంతరించుకోక మునుపు ఇంకెంత బాగుపడదో అని కూడా అనిపిస్తుంది.ఏది ఏమైనా భారతీయ ఆధ్యాత్మిక చింతనకు మూలకేంద్రమైన ఈ ప్రదేశం అవశ్య దర్శనీయం.........సశేషం

## నైమిషారణ్య యాత్ర -8

నైమిషంలో చక్ర తీర్థం,వ్యాస,-సూత,శౌనక గద్దెల తరువాత చూడవలసినవి లలితామాత మందిరం,
హనుమాన్ గద్దెలు.ఇవి కూడా ప్రాచీనత సంతరించుకున్న దర్శనీయ స్థలాలు.ఇవి గాక ఇటీవలి కాలంలో భక్త వరేణ్యులు నిర్మించినగాయత్రీ మందిర్,కాళీ పీఠ్,చార్ ధాం,బాలాజీ మందిర్ వంటివి చాలా ఉన్నాయి.
ఎంతో వ్య ప్రయాసల కోర్చి నిర్మించిన ఈ దేవళాలు
ఆధునిక శిల్ప సౌందర్యంతో అలరారుతూ సందర్శకులకు ఆనందానుభూతులను కలిగిస్తాయి.
ఇక లలితాదేవిగా పిలువబడే ఇక్కడి అమ్మవారి
ది లింగధారిణిగా పరిగణించబడే శక్తి పీఠాలలోని ఒక శక్తి స్వరూపం. మూర్తి చిన్నగా కనిపించినా ఉపాసకుల దృష్టిలో అత్యంత శక్తి సంపన్నమైన దేవి లలితా మాత.ఈ ఆలయంలో సంతత హోమం జరుగుతుంది.శిల్ప కళతో ఉట్టి పడే ఈ ఆలయం ముందు పెద్ద కోనేరు ఉన్నది.చక్రతీర్థానికి సమీపంలో ఉన్న ఈ ఆలయం ఎప్పుడూ సందడిగా ఉంటుంది.
అలాగే గోమతీనది స్నాన ఘట్టానికి సమీపంలో ఎత్తైన ప్రదేశంలో ఉంది హనుమాన్ గద్దె.ఈ ఆలయంలో రామలక్ష్మణులను తన భుజస్థంధాలమీద ఎక్కించుకున్న అతి పెద్ద సహజ శిలా శిల్పం ఉంది.దీనినే పాండవుల గద్దె అని కూడా అంటారు. హనమాన్ గద్దె ప్రక్కనే పంచ పాండవులు మరియు ద్రౌపది విగ్రహాలున్న మందిరం ఉంది. హనుమాన్ దేవాలయం కుడివైపునుండి గోమతిని చేరడానికి మెట్లు ఉన్నాయి.మెట్లు దిగి కుడి వైపు కొంత దూరం నడిస్తే
అక్కడ పంచముఖ గాయత్రీ దేవి ఆలయం ఉంది.
ఇక కాళీ పీఠ్ లలితా మాత గుడికి ఎదరుగా ఉంటుంది.ఇక్కడ కాళీమాత విగ్రహం చాలా పెద్దగా ఆకర్షణీయంగా ఉంటుంది. తరచు ఇక్కడ ఆధ్యాత్మిక సభలు,భజనలు జరుగుతుంటాయి. దీని ముందు నుండి పైకి వెళ్తే మెట్లతో నిర్మించబడిన విశాలమైన గోమతీనది స్నాన ఘట్టం వస్తుంది.ఈ మధ్య దారిలో తెలుగు వాళ్లు నిర్మించిన బాలాజీ మందిర్,దాని ప్రక్కనే ప్రవచనమందిరం,యజ్ఞశాల,అందమైన

పూలతోట,పూలతోట ముందు రెండు నిలువులెత్తు
సత్యనారాయణ స్వామి విగ్రహం ఉన్నాయి.ఈ ఆలయంలో నిత్యం సత్యనారాయణ స్వామి వ్రతాలు
జరుగుతుంటాయి. మన ప్రాంతంనుండి పెద్ద సంఖ్యలో బృందాలుగా వెళ్లి వారంపాటు అక్కడ ఉండి భాగవత సప్తాహాలు,సామూహిక సత్య నారాయణ వ్రతాలు జరుపుకోవటం ఇటీవలి కాలంలో ఎక్కువగా జరుగుతున్నది.నేను కూడా 'అభినవ శుక','పురాణ వాచస్పతి' బిరుదాంచితులైన బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మగారి నేతృత్వంలో కరీంనగర్ యాత్రికబృందంలో వెళ్లటం జరిగింది.ఆయన ఏడు రోజుల పాటు ఉదయం,సాయంత్రం కమనీయంగా భాగవత ప్రవచనం గావించారు.చివర రుక్మిణీ కల్యాణం,సామూహిక సత్యనారాయణవ్రతాలు నిర్వహించారు.........సశేషం

నైమిషారణ్య యాత్ర-9

..............................

నైమిషారణ్యం క్షేత్రంలో చూడవలసిన వాటి గురించి ఇంత వరకు నాకు తెలిసిన రీతిలో వివరించటం జరిగింది.సాధారణంగా తీర్థయాత్రలకు వెళ్లే వాళ్లు ఏదైనా ప్రదేశం వెళ్లితే ,ఆ ప్రదేశం లేదా క్షేత్రానికి చుట్టు ప్రక్కల ఉన్న క్షేత్రాలో,
తీర్థాలో,చారిత్రిక ప్రదేశాలో చూచి రావడం సహజం.

అలాగే నైమిషారణ్య యాత్ర వచ్చిన వాళ్లు దగ్గరలో వున్న దధీచి కుండ్,రుద్ర కుండ్,హత్యాహరణ కుండ్,దేవ దేవేశ్వర్ చూడటానికి వెళ్లారు.ఈ ప్రదేశాలన్నీ నైమిష క్షేత్రానికి 20-30 కి.మీ.ల దూరంలో ఉన్నాయి.స్థానికంగా ఏడు సీట్ల ఆటోలు లేదా మినీ వ్యాన్ వారితో బేరం కుదుర్చుకుని ఒక రోజు ఉదయం నుండి సాయంత్రం లోపు అన్నీ చూసకొని రావచ్చు.

ముందుగా దధీచి కుండ్ తీసుకువెళ్తారు.అక్కడ చాలా పెద్ద జలాశయం ఉంది.చుట్టూ మెట్లతో నిర్మించిన ఈ అతి పెద్ద కోనేరు(కుండ్ లేదా గుండం)లో స్నానం చేయటం కంటే నెత్తిపై నీళ్లు చల్లుకుని అందులోని పెద్ద పెద్ద చేపలకు చిరు తిండ్లు విసరటమే ముఖ్యం.నీళ్లు బాగా లోతుగా ఉండటం,చేపలు తిరుగుతూ ఉండటం వల్ల స్నానానికి అనుకూలం కాదు.ఆ కోనేరుకు ఆనుకుని తూర్పు దిశలో ఎత్తుగా దధీచి మహర్షి మందిరం ఇంకా కొన్ని చిన్న చిన్న మందిరాలు ఆకర్షణీయంగా నిర్మించారు.వృత్రాసురుడు బ్రహ్మచే వరంపొంది
దేవతలను బాధిస్తుంటాడు, వాడి బాధలు పడలేక
బ్రహ్మ దగ్గరికి వెళ్లి విచారిస్తే ఆయన మహాతపశ్శాలి యైన దధీచి ఎముకలతో చేసిన ఆయుధం చేత వృత్రాసురుని సంహరించ వచ్చునని ఉపాయం చెబుతాడు. కాని దధీచి ఎముకలు ఇవ్వాలంటే
అతను ప్రాణత్యాగం చెయ్యాలి. ఎవరు మాత్రం అడుగగలరు. ఎట్లాగో దధీచికి ఈ విషయం తెలిసి దేవతలకు వృత్రాసురుని బాధ లేకుండా తన దేహాన్ని అగ్నికి అర్పిస్తాడు. 'త్యాగ ఏకో గుణ శ్లాఘ్యః'
అన్నట్లు ఈ త్యాగ భూమిని సందర్శించి పునీతులు కావచ్చు.

ఆ తరువాత అక్కడినుండి బయలు దేరి రుద్ర కండ్ చేరుతాం.రుద్రకుండ్ నదలోనే ఒక ప్రక్కగా ఉన్న నీటి గుండం. అందలో రెండు పండ్లు వేస్తే ఒకి మునిగి ఒకటి తేలటం,అలాగే మారేడు దళం వేసినా,-పాలు పోసినా నేరుగా కిందికి దిగటం ఆశ్చర్యం కలిగిస్తుంది. అక్కడనుండి కొంత దూరంలో గోమతీ తీరంలో ఉన్న దేవదేవేశ్వర్ ఆలయంలో భోలానాథ్ గా పిలువబడే శివుడు,దాని వెనుకే నది ఒడ్డున రామేశ్వర నాగేశ్వర లింగాలు ఉంటాయి.........రేపు ముగిస్తాను.

నైమిషారణ్య యాత్ర-10

......................................

దేవదేవేశ్వర్ వెనుకవైపు గోమతి చుట్టూ చెట్లతో ఆహ్లాదకరంగా ఉంటుంది.దేవాలయం ప్రక్కనే పటిష్టంగా నిర్మించబడ్డ యాగశాల ఉంది.ఆలయంలో ఒకరిద్దరు పూజారులు,పరిచార-

కులు,పూజాద్రవ్యాల కొట్టు వాళ్లు ఒకరిద్దరు తప్ప ఆ ప్రదేశమంతా నిర్జనంగా కనిపిస్తుంది.పిక్నిక్లకు అనువుగా ఉంటుంది.

అక్కడ్నుండి బయలుదేరితే ముప్పై కిలోమీటర్ల దూరంలో హత్యాహరణ్ కుండ్ చేరుకుంటాము.దీర్ఘ చతురస్రాకారంలో ఉన్న పెద్ద కొలను లేదా మన పరిభాషలో కోనేరు.చుట్టూ ప్రదక్షిణ చేయడానికి సిమెంటు బాట ఉంటుంది. పడమటివైపు ఒడ్డుననే పంచముఖ శివాలయం తూర్పుదిశలో ఆంజనేయస్వామి,దుర్గామాత దేవాలయాలు ఉన్నాయి. హత్యాదోష నివారణకు ఇందులో స్నానమాచరిస్తారు.రావణ వధానంతరం బ్రహ్మ హత్యాదోషనివారణకై రాముడు,కురుక్షేత్ర యుద్ధానంతరం పాండవులు ఇక్కడ స్నానంచేసి పునీతులైనట్లుగా చెబుతారు. ఈత వచ్చినవాళ్లు హాయిగా ఈత కొట్టవచ్చు.సాధారణంగా యాత్రికులు నెత్తిపై నీళ్లు చల్లుకుని ప్రదక్షిణంచేసి వెళ్తారు.చిన్నపిల్లలు డబ్బులు అడుగుతారు. చిల్లర దగ్గర ఉంటే మంచిది. మెట్లు జారుతుంటాయి.జాగ్రత్తవహించాలి.అక్కడనుండి తిరుగు ప్రయాణం నైమిషానికి. నైమిషంలోనే ఆధనిక దేవాలయ సముదాయం చార్ ధాం.ఎత్తైన మెట్లమీద కట్టిన ఈనిర్మాణాలు కన్నులకింపుగా ఉంటాయి. ఒకవైపు ఆంజనేయస్వామి ఆలయం,మరోవైపు భారతదేశం నాలుగు శివాలయాల అనురూపంగా ఒకే ఆలయంలో నాలుగు మంటపాల్లో నాలుగు లింగాలు ఉంటాయి.

దక్షిణంలో ఉన్న రామేశ్వరుడు,పడమరలోఉన్న సోమేశ్వరుడు,ఉత్తరాన కేదారేశ్వరుడు తూర్పున ఉన్న విశ్వేశ్వరుడు ఒక్కో మందిరంలో కనిపిస్తారు.ఆలయ సముదాయం ముందు చక్కని తోట,తోటలో చిన్న మంటపంలో ఆలయం నిర్మింపజేసిన స్త్రీ మూర్తి ముకుళిత హస్తాలతో దర్శనమిస్తుంది.

ఇక ఒక అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే నైమిషారణ్య క్షేత్రంలో ప్రతి నెల అమావాస్య నాడు అనూహ్యమైన రద్దీ ఉంటుంది.సోమవారం అమావాస్య కలిసి వస్తే ఇంకా విశేషం- అమావాస్య నాడు గోమతి స్నానం అత్యంత ఫలదాయకం పాపహరణంగా భక్తుల విశ్వాసం.

ఇంకా జానకీరాం మందిరం,కాళీఘాట్,గాయత్రి ఆలయం, గోశాలలు,ఆశ్రమాలు చాలా ఉన్నాయి.వానప్రస్థంలో ఇక్కడ నివాసమేర్రచుకున్న నిరాడంబర ఆధ్యాత్మిక జీవనులు (వయోవరిష్ఠులు)దర్శనమిస్తారు.

అరణ్యప్రదేశం కనుక ఇక్కడ కోతులు బాగా సంచరిస్తుంటాయి.వాటి గురించి అప్రమత్తంగా ఉండాలి.ప్రతి చోటా పూజలు చేయించే వాళ్లు చాలామంది కనిపిస్తుంటారు.యాత్రికుల వెంబడి పడటంకూడా సహజమే.ఎంత పుణ్యస్థలమైనా పొట్టతిప్పలు తప్పవు.మన సంప్రదాయంలో దానానికి అత్యంత ప్రాధాన్యత ఉన్నది.వెంట బడినా పీడించే రకాలు కాదు ఇక్కడి అర్చక,-యాచకులు.ఇచ్చిన దానితో సంతృప్తి చెందుతారు.అలాగే ఆటోల వాళ్లు,రిక్షా వాళ్లు పేచీకోర్లు కాదు.దేవాలయ పరిసరాల్లో పూలూ పళ్లూ అమ్ముకునే చిన్న బేహారులు ఇంకా ఈ పవిత్ర స్థలాన్ని తమ జీవన భృతికి ఆధారంగా ఎంచుకున్న వారు నిర్భాగ్యులు ఎందరో కనిపిస్తారు. వారిలోనే పరమాత్ముణ్ణి దర్శించి ఆలయాల్లో హుండీలో వేయటం కొంత తగ్గించి ఇలాంటి వారిని కనికరిస్తే మీలోని మానవత్వ పరిమళానికి పరమాత్ముడు సంతసించి మీ ఇష్టకామ్యార్థ సిద్ధిని కలిగిస్తాడు.

చివరగా 'యద్భావం తద్భవతి' అన్నట్లు మంచైనా చెడైనా మన ఆలోచనల్లోనే ఉంటుంది గనుక ఆధ్యాత్మిక భావంతో యాత్ర చేసిన వారికి కష్టాలు కూడా బాధను కలిగించవు.నా ఈ యాత్రా విశేషాలను చదివిన వారందరికీ నా కృతజ్ఞతలు.

తెలియకుండా ఎక్కడైనా తప్పులు దొర్లితే క్షమించి, తెలియపరిస్తే దిద్దుకుంటాను.

సర్వేజనాస్సుఖినో భవంతు

## ఆదూరి హైమవతి



# కర్తవ్యం

కనపర్తి గ్రామ పొలిమేరల్లోని నదీతీరంలో సత్యదేవుడనే ఒక యోగి చిన్న పర్ణశాల నిర్మించుకుని, అడవిలో లభించే పండ్లూ, కాయలూ భుజిస్తూ దైవ ధ్యానం చేసుకుంటూ ఉండేవాడు. ఆయన సకల శాస్త్రాలనూ వేదసారాన్నీ ఔపోసన పట్టిన విద్యావేత్త. కనపర్తికి వచ్చి పోయే జనం నదీ నీరు త్రాగి అలసట తీర్చుకోను ఆ ఆశ్రమ పరిసరాల్లో కొంతసేపు విశ్రమించి వెళ్ళేవారు. కుటీరం బయట సత్యదేవుని చూసినపుడు జనులు ఆయనను సమీపించి నమస్కరించేవారు. వారితో ఆయన ప్రశాంతంగా, ప్రేమగా మాట్లాడేవాడు. ఆయన చెప్పే మాటలు వారి హృదయాలకు హత్తుకునేవి. ఆయన చిన్నకథల రూపంలో వేదాంతసారాన్నీ, ఆధ్యాత్మికతను, మానవత్వ విలువలను రంగరించి చెప్పేవాడు. అప్పుడపుడూ వారు తమసందేహాలు, ఇబ్బందులూ చెప్పుకోగా ఆయన వారిని సాంత్వన పరిచేవాడు. అలా ఆ నోటా ఆ నోటా సత్యదేవుని గురించి ప్రచారమై, అనేక మంది కేవలం ఆయన మాటలు వినవచ్చేవారు. కొంతమంది బళ్ళు కట్టుకుని వచ్చి వండుకు తింటూ అక్కడే మూడు నాలుగు రోజులు గడిపేవారు. అలా అలా ఆయన విద్వత్తు గురించి తెలిసి దూర ప్రాంతాల నుండి సైతం జనం వారి బిడ్డలను విద్యాభ్యాసం కోసం తీసుకుని వచ్చి సత్యదేవుని బ్రతిమాలి, తమ బిడ్డలకు విద్యాదానం చేయమని ప్రాధేయపడేవారు. అన్ని దానాల్లోకి విద్యాదానం గొప్పది కనుక, కాదనకుండా సత్యదేవుడు అంగీకరించగా, స్వయంగా వారే తమ బిడ్డలకోసం నివాసయోగ్యంగా పాకలు ఆశ్రమం చుట్టూ నిర్మించి కావలసిన వసతులు ఏర్పరుచుకున్నారు. సత్యదేవుని పర్ణశాల ఒక ఆశ్రమ పాఠశాలగా మారింది. సత్యదేవుని వద్ద విద్యాభ్యాసం ముగించినవారు దేశదేశాల్లో గురువు కీర్తిని చాటుతూ, కీర్తి ప్రతిష్టలు పొంది ధనమార్జించి సుఖంగా జీవించసాగారు.

విద్యాభ్యాసం పూర్తి అయినా ఆశ్రమం విడచివెళ్ళని విద్యార్థులను ఆయన పిలిచి, "మీ విద్యాభ్యాసం పూర్తి అయి చాలా కాలం అయింది కదా! మీ మీ ప్రాంతాలకు వెళ్లి మీ జీవనవిధానాన్ని సాగించక ఇంకా ఇక్కడే ఉండిపోయారేమి?" అని అడిగారు. 'మేము మిమ్మల్ని విడచి వెళ్ళలేము' అని వారు జవాబివ్వగా ఆయన చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. కొంతకాలానికి సత్యదేవుడు తన పంచ భౌతిక శరీరాన్ని వీడగా ఆ విద్యార్థులు ఆయన శరీరంపై పడి విలపించసాగారు. ఆ పక్కగా వెళుతున్న ఓ భిక్షకుడు ఆశ్రమం లోనికి వచ్చి ఎందుకు విలపిస్తున్నారని వారిని అడుగగా 'మా గురుదేవులు మమ్మల్ని విడచి వెళ్ళారు, ఇంతకన్నా కష్టం మాకేముంటుంది?" అని అన్నారు ఆ శిష్యులు. అప్పుడు ఆ భిక్షకుడు, " మీవంటి మూర్ఖులు తన శిష్యులైనందుకు మీ గురుదేవులు బ్రతికి వుంటే ఇంకా విచారించేవారు! మీకు అంటిన జ్ఞానం శూన్యం అన్నమాట!" అని వెళ్ళిపోయాడు.

దానితో ఆ శిష్యులకు జ్ఞానోదయమయ్యి, గురువుగారు బోధించిన వేదాంత సారాన్ని గుర్తు తెచ్చుకుని తమ కర్తవ్య నిర్వహణలో నిమగ్నమయ్యారు.

# చిలకమర్తి దుర్గా ప్రసాదరావు





# SPOKEN SANSKRIT

+91 9897959425

## (సంభాషణ సంస్కృతం -16)

సంస్కృతభాషలో ఒక నియమం ఉంది . అదేంటంటే విశేష్యం ఏ లింగం, ఏ వచనం, ఏ విభక్తులలో ఉంటుందో విశేషణం కూడ అదే లింగం అదే వచనం అదే విభక్తులలో ఉండాలి యల్లింగం యద్వచ-నం యా చ విభక్తి: విశేష్యస్య తల్లింగం తద్వచనం సా చ విభక్తి: విశేషణస్యాపి

**Generally an adjective qualifies noun or a pronoun in a sentence. Normally adjectives have no definite gender. They are used in accordance with the gender of the noun or pronoun. In Sanskrit Grammar there is complete declension for all adjectives quite in accordance with the noun or pronoun. Here is the rule:**

यल्लिङ्गं यद्वचनं या च विभक्ति: विषेष्यस्य तल्लिङ्गं तद्वचनं सा च विभक्ति: विशेषणस्यापि

**which means that the noun and the adjective should be in the same gender, same number and same case. If the noun is in masculine gender the adjective is also in masculine. If the noun is in singular number the adjective is also in singular. Similarly if the noun is in nominative case the adjective is also in the nominative case. This rule is applicable even for numerical words also.**

विशेषणविशेष्यभाव: **in three genders:**

| पुंलिङ्ग: | स्त्रीलिङ्ग: | नपुंसकलिङ्ग: |
|---|---|---|
| रम्य: राम: - | रम्या सीता – | रम्यं वनम् |
| రమ్య: రామ: | రమ్యా సీతా | రమ్యం వనం |
| सुन्दर: बालक: - | सुन्दरी बालिका – | सुन्दरं पुस्तकम् |
| సుందర: బాలక: | సుందరీ బాలికా – | సుందరం వనం |
| रमणीय: वृक्ष: - | रमणीया लता – | रमणीयं पुष्पम् |
| రమణీయ వృక్ష: - | రమణీయా లతా – | రమణీయం పుష్పం |

| कमनीय: ग्रन्थ: - | कमनीया कथा – | कमनीयं काव्यम् |
|---|---|---|
| కమనీయః గ్రంథః | కమనీయా కథా | కమనీయం కావ్యం |

| चतुर: कथक: -- | चतुरा नटी – | चतुरं प्रदर्शनम् |
|---|---|---|
| చతురః కథకః | చతురా నటీ | చతురం ప్రదర్శనం |

विशेषणविशेष्यभाव: **in three genders, three numbers and seven case.**

पुंलिङ्ग: **(masculine gender)**

विभक्ति : एकवचनम् द्विवचनम् बहुवचनम्

प्रथमा -- सुन्दर: बालक: - सुन्दरौ बालकौ - सुन्दरा: बालका:

संबोधन प्रथमा-- हे सुन्दर बालक ! * हे सुन्दरौ बालकौ * हे सुन्दरा: बालका:

द्वितीया -- सुन्दरं बालकं * सुन्दरौ बालकौ * सुन्दरान् बालकान्

तृतीया -- सुन्देरण बालकेन* सुन्दराभ्यां बालकाभ्याम् * सुन्दरेभ्य: बालकेभ्य:

चतुर्थी-- सुन्दराय बालकाय * सुन्दराभ्यां बालकाभ्याम् * सुन्दरेभ्य: बालकेभ्य:

पञ्चमी-- सुन्दरात् बालकात्* सुन्दराभ्यां बालाकाभ्याम् * सुन्दरेभ्य: बालकेभ्य:

षष्ठी-- सुन्दरस्य बालकस्य* सुन्दरयो: बालकयो:* सुन्दराणां बालकानाम्

सप्तमी-सुन्दरे बालके* सुन्दरयो: बालकयो: -सुन्दरेषु बालकेषु

स्त्रीलिङ्ग: **(feminine gender)**

विभक्ति: एकवचनम् द्विवचनम् बहुवचनम्

प्रथमा:- सुन्दरी बालिका || सुन्दर्यौ बालिके || सुन्दर्य: बालिका:

सं || प्रथमा:- हे सुन्दरि बालिके || हे सुन्दर्यौ बालिके || हे सुन्दर्य: बालिका:

द्वितीया:- सुन्दरीं बालिकाम् || सुन्दर्यौ बालिके || सुन्दर्य: बालिका:

तृतीया:- सुन्दर्या बालिकया || सुन्दरीभ्यां बालिकाभ्याम् || सुन्दरीभि: बालिकाभि:

चतुर्थी:- सुन्दर्यै बालिकायै || सुन्दरीभ्यां बालिकाभ्याम् || सुन्दरीभ्य: बालिकाभ्य:

पञ्चमी:- सुन्दर्या: बालिकायै || सुन्दरीभ्यां बालिकाभ्याम् || सुन्दरीभ्य: बालिकाभ्य:

षष्ठी- सुन्दर्या: बालिकाया: || सुन्दर्यो: बालिकयो: || सुन्दरीणां बालिकानाम्

सप्तमी- सुन्दर्यां बालिकायाम् || सुन्दर्यो: बालिकयो: || सुन्दरीषु बालिकासु

नपुंसकलिङ्ग: **(Neuter gender)**

विभक्ति: एकवचनम् द्विवचनम् बहुवचनम्

प्रथमा सुन्दरं पुस्तकम् * सुन्दरे पुस्तके * सुन्दराणि पुस्तकानि

द्वितीया सुन्दरं पुस्तकम् * सुन्दरे पुस्तके * सुन्दराणि पुस्तकानि
तृतीया -- सुन्दरेण पुस्तकेन * सुन्दराभ्यां पुस्तकाभ्याम् * सुन्दरैः पुस्तकैः
चतुर्थी-- सुन्दराय पुस्तकाय * सुन्दराभ्यां पुस्तकाभ्याम् * सुन्दरेभ्यः पुस्तकेभ्यः
पञ्चमी-- सुन्दरात् पुस्तकात् * सुन्दराभ्यां पुस्तकाभ्याम् * सुन्दरेभ्यः पुस्तकेभ्यः
षष्ठी-- सुन्दरस्य पुस्तकस्य* सुन्दरयोः पुस्तकयोः * सुन्दराणां पुस्तकानाम्
सप्तमी -- सुन्दरे पुस्तस्के * सुन्दरयोः पुस्तकयोः * सुन्दरेषु पुस्तकेषु

| पुंलिङ्गः | स्त्रीलिङ्गः | नपुंसक लिङ्गः |
|---|---|---|
| एकः | एका | एकम् |
| एकः बालकः- | एका बालिका | एकं पुस्तकम् |
| एकः वृक्षः | एका लता | एकं पुष्पम् |
| एकः चमसः | एका दर्वी | एकं पात्रम् |
| एकः पुरुषः | एका महिला | एकं मन्दिरम् |
| एकः समुद्रः | एका नदी | एकं सरः |

**Example:-** एकः बालकः एका बालिका च एकं पुस्तकं पठतः

| द्वौ | द्वे | द्वे |
|---|---|---|
| द्वौ बालकौ | द्वे बालिके | द्वे पुस्तके |
| द्वौ वृक्षौ | द्वे लते | द्वे पत्रे |
| द्वौ पुरुषौ | द्वे महिले | द्वे वाहने |

Example: द्वौ बालकौ द्वे बालिके गृहीत्वा पाठशालां गच्छन्ति

| त्रयः | तिस्रः | त्रीणि |
|---|---|---|
| त्रयः युवका : | तिस्रः वनिताः | त्रीणि पुस्तकानि |
| त्रयः वृक्षाः | तिस्रः लताः | त्रीणि पत्राणि |
| त्रयः क्रीडाकाराः | तिस्रः क्रीडाकारिण्यः | त्रीणि कन्दुकानि |

**Example:** त्रयः युवकाः, तिस्रः वनिताः त्रीणि कन्दुकानि गृहीत्वा क्रीडाङ्गणे क्रीडन्ति

| चत्वारः | चतस्रः | चत्वारि |
|---|---|---|
| चत्वारः पुरुषाः - | चतस्रः महिलाः - | चत्वारि फलानि |
| चत्वारः बालकाः | चतस्रः बालिकाः | चत्वारि पुष्पाणि |
| चत्वारः पर्वताः | चतस्रः नद्यः | चत्वारि सरांसि |

**Example:** चत्वारः बालकाः, चतस्रः बालिकाः च चत्वारि फलानि देवाय समर्पयन्ति
**From five the forms are the same in all genders:**

| पञ्च | पञ्च | पञ्च |
|---|---|---|
| पञ्च बालकाः | पञ्च बालिकाः | पञ्च पुस्तकानि |

पञ्च बालकाः पञ्च बालिकाः च पञ्च पुस्तकानि गृहीत्वा ग्रन्थालयं गच्छन्ति

## Unit 2.

पुरातनम् ప్రాచీనం (old/Ancient) x नूतनम् నవీనం (new/modern)
हस्तिनापुरं (Hastinapuram) पुरातनं नाम देहली (Delhi) नूतनं नाम **హస్తినాపురం పాతపేరు ఢిల్లి కొత్తపేరు.**
**Hastinapura is the ancient name Delhi is the modern name.**
पाटलीपुत्रं (PaaTaliputram) पुरातनं नाम पटना (Patna) नूतनं नाम **పాటలి పుత్రం పాతపేరు పాట్నా కొత్త పేరు.**
**Pataliputra is the ancient name Patna is the modern name.**
कोणार्कमन्दिरं पुरातनम् अस्ति बिर्लामन्दिरं नूतनम् अस्ति
**కోణార్కమందిరం ప్రాచీనమైనది. బిర్లా మందిరం నవీన మైనది.**
**Konark temple is ancient and Birla Mandir is modern**

## Unit – 3.

बहु **చాల** x किञ्चित् **కొంచెము**
बहु **(more/large amount of ) x** किञ्चित् **( less/little amount of)**

समुद्रे जलं बहु अस्ति – कासारे जलं किञ्चिद् अस्ति ||
**సముద్రంలో ఎక్కువ నీరు ఉండును. చెరువులో తక్కువ నీరు ఉండును.**
**There is much amount of water in sea and little amount of water in a tank.**
वित्तकोशे धनं बहु अस्ति - गृहे धनं किञ्चिद् अस्ति ||
**బ్యాంకులో చాల ధనం కలదు. ఇంటిలో కొంచెము ధనం కలదు.**
**There is large amount of money in the Bank and little amount of money in the house.**
ग्रामजीवने सौख्यं बहु अस्ति नगरजीवने सौख्यं किञ्चिद् अस्ति ||
**గ్రామాల్లో జీవిస్తే సుఖం ఎక్కువ. నగరాల్లో జీవిస్తే సుఖం తక్కువ.**
**Rural life is more delightful and urban life is less delightful.**
राजकीयनायक: बहु वदति किञ्चिद् अपि न करोति ||**రాజకీయ నాయకుడు ఎక్కువ మాట్లాడును తక్కువ పని చేయును.**
**A politician speaks a lot and does not do even a little bit.**

## Unit – 4

ह्रस्व: x दीर्घ:
ह्रस्व: **(short) పొట్టి** x दीर्घ: **(long) పొడుగు**
गजस्य वाल: ह्रस्व: अस्ति गजस्य तुण्ड: तु दीर्घ: अस्ति ||
**ఏనుగు తోక పొట్టిగా ఉండును తొండము పొడవుగా ఉండును**

The tail of an elephant is short but the trunk is long.

नदीतरङ्ग: ह्रस्व: अस्ति समुद्रतरङ्ग: दीर्घ: अस्ति ||

నది యొక్క కెరటము పొట్టి. సముద్ర కెరటము పొడవు.

The wave of a river is short and the wave of an ocean is long.

आम्रवृक्ष: ह्रस्व: अस्ति तालवृक्ष: दीर्घ: अस्ति

Mango tree is short palm tree is long.

మామిడి చెట్టు పొట్టిగా ఉండును. తాడి చెట్టు పొడవుగా నుండును

स्थूल: x कृश:

स्थूल: (stout )లావు x कृश: (lean) సన్నము

गजस्य तुण्ड: स्थूल: भवति ఏనుగు తొండము లావుగా ఉండును

(elephant's trunk is stout )

गजस्य वाल: कृश: भवति ఏనుగు తోక సన్నగా ఉండును

(Elephant's tail is lean)

अङ्गुष्ठ: स्थूल: भवति బొటన వ్రేలు లావుగా ఉండును ( Thumb is stout)

अनामिका कृश: भवति చిటికెన వ్రేలు సన్నగా ఉండును ( Little finger is lean)

## Unit – 5.

### इव (like/as if)

बालक: वृद्ध: इव मन्दं गच्छति

బాలుడు వృద్ధుని వలె మెల్లగా నడుస్తున్నాడు .

The boy is walking slowly like an old man.

अस्मिन् आधुनिके काले महिला: पुरुषा: इव सर्वासु कलासु नैपुण्यं प्रदर्शयन्ति ||

ఈ ఆధునిక యుగంలో మహిళలు పురుషులవలే అన్ని విద్యలలోను నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు

In this modern age women are showing talent like men in all types of arts.

राजकीयनायक: भिक्षुक इव सञ्चरति ||

రాజకీయ నాయకుడు ముష్టివాని వలె తిరుగుచున్నాడు.

The politician is wandering like a beggar.

अर्जुन: भीरु: इव विलपति ||

అర్జునుడు పిరికివాని వలె విలపించుచున్నాడు లే!

Arjuna is lamenting like a timid fellow.

अलसा: रोगिण: इव मञ्चेषु शयनं कुर्वन्ति ||

సోమరులు రోగులవలె మంచం మీద పడుకున్నారు.

Lazy people are lying on beds like patients.

******

# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

ఎద్దును తోలితే బండి గిర్రున తిరుగుతుంది గాని పైకి లేవదు.

ఇంకో మనిషి సాయం కావాలి. ఎవరూ కనపడరు. అలాగే కొంచెంసేపు ఉండిపోయాం. "ఏం రాయుడూ, బండి కుంగిందా?" అంటూ రాయిపెద్ది వెంకటరమణయ్య వచ్చారు. వీరిద్దరూ ప్రత్యర్థులు. "నే పట్టుకుంటా, నువ్వు కానీయ్" అంటూ కాడిమాను పట్టుకున్నాడు వెంకటరమణయ్య.

మా పెద్దనాయన బండి క్రింద దూరి, ఇరుసు కింద నడుము పెట్టి, పైనున్న పంచ చుట్టగా చుట్టి, నొక్కుకోకుండా నడుముపై పెట్టుకుని, నాలుక మడత పెట్టి, 'తోలరా బండిని" అంటూ అరిచాడు. అంతే ... చలకోలతో ఒక్క దెబ్బ వేశా ఎద్దును. పెద్దనాన్న నడుం బలంతో కుంగిపోయిన మాను రెండడుగులు పైకి లేచి, ఫెళ ఫెళమని శబ్దం చేస్తూ ముందుకు దూకింది. రెండు గండ్ల మధ్య బోర్ల పండుకుని మళ్ళీ పైకి లేచాడు పెద్దనాయన.

"ఓయ్... బండి బాగా తోలావ్ కదోయ్ ... నాయాలా!" అంటూ నాతో చతురాడేడు వెంకటరమణయ్య. మంచి ముదురెద్దులు కదా మామా... తోలటం కష్టం కాదని నేనన్నా.


"ఓయ్ ... ఓయ్... నాయాలా.. ఎంత మాటన్నావోయ్ ..." అంటూ నవ్వుకుంటూ పోయాడు వెంకటరమణయ్య.

తరవాత ఈ ఎద్దును కూడా నష్టానికే అమ్మాల్సివచ్చింది.

## చివరి ఎద్దుల జత

ఆశ తీరని, ఆశయం నెరవేరని, ఆరాటం ఆగని, ఆర్భాటం వదలని మనిషి చివరి వరకు పోరాటం చేస్తూనే ఉంటాడు. కాలం కాటు వేసినపుడు వెనకడుగు వేసి, కాలం కలిసొచ్చే వరకు కనిపెట్టుకుని ఉండడు మనిషి. ఏదో సాధించాలని, తనను తాను నిరూపించుకోవాలని ఆరాటపడతాడు. అదో .. అదే ఆరాటంతో చివరిగా అక్కడ, ఇక్కడ .... అన్నిచోట్ల పోగుచేసుకున్న డబ్బుతో చివరి ఎద్దుల జతను ఒంగోలు నుండి తెచ్చాడు. అప్పటికి ఒంగోలులో ఇంకా మాకు భూములు ఉండేవి. పన్నులు కూడా కడ్తుండేవారు.

ఒంగోలు ఎద్దులను కొనుగోలు చేయటానికి వెళ్ళినప్పుడంతా వల్లూరి కరణం గారికి భూమి పన్నులు కట్టి వస్తూండేవారు. ఏండ్ల తరబడి కట్టినా రశీదులు తీసుకోలేదు. చాలా ఏండ్ల తరవాత మేలుకొని చూస్తే ,,, భూమి ఎప్పుడో అన్యాక్రాంతమయ్యింది.





చివరి ఎద్దుల జతను కొనితెచ్చారు. ఇంటికి వచ్చిన తరవాత వాటికి కావాల్సిన ఆహారం సమకూర్చటం కష్టం అయింది. ఏదో మామూలు ఎండు గడ్డి, చొప్ప, శనగకట్టె తినమంటే అవి తినవు. అందులో ఒక ఎద్దు మరీ మొండిది. కోపమెక్కువ. పొడవటం కూడా అలవాటుంది దానికి. సేద్యం నేర్పడమే కష్టమైంది. అందుకే దాన్ని అమ్మేయాలని చూశారు. పొడిచే అలవాటుండే ఎద్దులను కొనటం చాలా అరుదు. అందుకై తక్కువ ధరకే దాన్ని అమ్మేశారు.

ఇకరెండో ఎద్దుకు అనుకోకుండా 'గాలి కుంటు వ్యాధి' సోకింది. ఈ వ్యాధి సోకితే తేరుకోవటం చాలా కష్టం. వళ్ళంతా నల్లగా కమిలి, చలికి బాగా వణికిపోతూ ఉంది. ఇంట్లో వట్టి గడ్డి కూడా అయిపోవచ్చింది. చివరకు మేత కూడా లేదు. ఇంట్లో రావి చెట్టు కొమ్మలు కొట్టి రావి ఆకు వేస్తే తినేది పాపం. దీని బాధ చూడలేక ఎంతకైనా అమ్మితే, ఎవరింట్లోనైనా తిండి తిని, పని చేసుకుంటూ ఉంటుందని అయినకాడికి అమ్మేశారు.

పొడిచే ఎద్దును కొన్న అతను మాత్రం దాని ఆవేశాన్ని, కోపాన్ని, కసిని బాగానే వాడుకున్నాడట. తగినంత ఆహారం మాత్రం పెట్టి ఎప్పుడూ ఆకలి రగిలించేవాడట. ఎక్కువగా కొండ కట్టెలు తోలటానికి బండి కట్టేవాడట. బాగా కొట్టే వాడట. ఎంత బరువునైనా నాగుపాములాగా బుస కొడుతూ సరసర లాగుతూ వుండేదట.

ఇంటికి చేరుకున్నాక గాటికి కట్టేయాలంటే, అటువైపు, ఇటు వైపు ఇనుప ముకుతాడుకు పగ్గం గాటికి కట్టేసేవాడు. కొమ్ముల దగ్గర నుండి ఇంకో తాడు రెండువైపులా కట్టి, ఆ మధ్యను చెండుకు తగిలించేవాడు. అంటే కుడి ఎడమలకు గాని, కిందకు పైకీ గానీ తల ఆడించకుండా. ఆడిస్తే 'ముక్కుతాడు' విపరీతంగా నొప్పి పుడుతుంది.

(ఇంకా వుంది)

# ఎలక్ట్రాన్

## ప్రతిభ



అదొక దేశంలోని మారుమూల ప్రాంతంలోని ప్రభుత్వాధీన సంస్థ. సంస్థ అధికారి సరస్వత్ తివారీ క్రియాశీలి. కార్యదక్షుడు. కేంద్రంతో పోరాడి, సంస్థకి బాహ్యమైన కొన్ని అభివృద్ధి పథకాలు చేబట్టి స్థానిక ప్రజల అభిమానాన్ని చూరగొన్నవాడు. అటువంటి అభివృద్ధిపథకాలలో ఒకటి ఇటు సంస్థ ఉద్యోగులకీ, అటు స్థానికులకీ అవసరమైన కేంద్రీయ పాఠశాల. ఇతర ప్రాంతాలలనుంచి బదిలీ అయిన సంస్థ ఉద్యోగులు ఆ మారుమూల ప్రాంతానికి రాకుండా విశ్వ ప్రయత్నాలు చేసి, చివరికి ఓడిన వారే వచ్చి చేరేవారు. దానికి ఒక కారణం బదిలీలమీద వచ్చే సంస్థ ఉద్యోగుల పిల్లలకి సరైన పాఠశాల లేకపోవడమే. సంస్థ పనికూడా సజావుగా జరిగేది కాదు. వార్షిక లక్ష్యాలు అతికష్టం మీద నెరవేరేవి. ఈ విషయాన్ని పదేపదే నూరిపోసి సంస్థ కేంద్ర అధికారులను ఒప్పించి ఇంట గెలిచాడు. సంస్థ ఉన్నత పాఠశాలకి అనుగుణమైన భవన నిర్మాణం అవీ చేబడ్తామని హామీ యివ్వడంతో కేంద్రీయపాఠశాలల విద్యాసంస్థ అంగీకారం తెలియజేసింది. ఏడాదిలో తివారీ నిత్య పరివేక్షణలో పటిష్టమైన పాఠశాల భవనం సంస్థ ప్రాంగణానికి పక్కనే తయారైంది.

అయితే సంస్థకొచ్చిన ఇబ్బందే కేంద్రీయ విద్యాసంస్థకీ వచ్చింది. ఇతరప్రాంతాలలో సుశిక్షితులైన అధ్యాపకులు బదిలీ మీద ఈ ప్రాంతానికి రాకుండా వారి ప్రయత్నాలు వారు చేశారు. నియమ నిబంధనలు తెలిసిన ప్రధానోపాధ్యాయుడి నియామకం త్వరగానే జరిగిపోయినా, ఆ రాష్ట్రానికే చెందిన ఇద్దరు ముగ్గురు వచ్చి చేరినా అన్నీ పాఠ్యాంశాల్ని బోధించే ఉపాధ్యాయుల్ని నియమించడం లేదా తరలించడం విద్యాసంస్థకి కష్టతరమైపోయింది.

ప్రధానోపాధ్యాయుడు గణేశ్ ముఖోపాధ్యాయ్ సరస్వత్ తివారీతో ఎదురవుతున్న ప్రతిబంధకాల్ని గురించి దీర్ఘాలోచన జరిపాడు.

“ఎంతో కష్టపడి ఉన్నతపాఠశాల స్థాపనికి మీరు ప్రయత్నించి విజయం సాధించారు. అయితే నా అధికారులు ఉపాధ్యాయుల్ని బదిలీ చెయ్యడంలో విఫలులైపోతున్నారు. ఏ విద్యాసంస్థకైనా మౌలికమైన సదుపాయాలెంత అవసరమో, బోధనా ప్రమాణాలూ అంతే అవసరం. సుశిక్షితు లైన గురువుల మాటటుంచి అసలు సంఖ్యాబలమే లేని గురువులతో పాఠశాలనెలా నడిపేది?”

“కేంద్రీయ విద్యాలయం వచ్చిందని తెలియగానే, ఇంతవరకూ తాత్సారం చేస్తున్న వివిధరాష్ట్రాలకి చెందిన సంస్థ ఉద్యోగులు ఇబ్బడిముబ్బడిగా వచ్చి చేరిపోయారు. ఇప్పుడు ఉపాధ్యాయుల కొరత అంటే నా సంస్థ ఉద్యోగులు ఇక్కణ్ణుంచి తిరిగి వెళ్లిపోడానికి విశ్వప్రయత్నం చేసేస్తారు. నాకో ఉపాయం తోస్తోంది. చెప్పమంటారా?”

**********

“వివిధ తరగతుల్లోనూ, మీ సంస్థ ఉద్యోగుల పిల్లలు నలభై శాతం లోపునే ఉన్నారు. అందుకనే ఈ ప్రాంతానికి, రాష్ట్రానికీ చెందిన కొంతమందిని చేర్చుకోవడం జరిగింది. అప్పటికీ ముందు అవసరాలు దృష్టిలో ఉంచుకొని ఇంకా యిరవై శాతం సీట్లని మీ



విద్యార్థులకి ఆరక్షణలో ఉంచాం. ఆదిలోనే హంసపాదంటే ఇరువురుకీ ఇబ్బందే! చెప్పండి. ఏదో చెయ్యాలిగా?"

"నా సంస్థ ఉద్యోగుల్లో చాలమందికి విద్యాధికులైన ఇల్లాళ్లున్నారు. అలాగే స్థానికంగా ఉన్న కొంత మంది మంచి ఉపాధ్యాయుల్ని వెతికి నియమిద్దాం. అలాగే మా సంస్థలో పని చేసే కొంతమంది ఆఫీసర్లని వంతులవారీ పాఠాలు చెప్పమని ఆదేశిస్తాను".

"ప్రభుత్వాధీనంలో ఉన్నా, మీ సంస్థకి స్వయంనిర్ణయాలు తీసుకొనే అధికారం ఉంది. మాకా స్వాతంత్ర్యం లేదు. ఇప్పటికే విద్యావిధానం ప్రాథమిక తరగతులనుండీ, ఆచార్య పట్టాల వరకూ ఓ నిర్దిష్టమైన దిశానిర్దేశం లేకుండా ఇష్టమొచ్చినట్టు పోతోంది. మా సంస్థ నియమాల ప్రకారం బోధనార్హత పట్టా లేనిదే ఉపాధ్యాయుల్ని స్వీకరించదు. ఇకపోతే మీరు మీ ఉద్యోగుల భార్యల్ని ఉపాధ్యాయవృత్తి చేబట్టమన్నా, గుత్తేదారక నియమకంగా అనుమతి లభించదు. ఆర్థికమైన కోణాలు అడ్డువస్తాయి."

"సరే! ఆర్థిక భారం విషయం గురించి నేను మా సంస్థని ఒప్పిస్తాను. మీరూ మీ అధికారులకి చాలా ఘాటుగా ఉత్తరం రాస్తూ, 'పంపితే ఉపాధ్యాయుల్ని పంపండి. లేకపోతే వారు చెప్పిన దానికి ఒప్పుకోండి. కాలక్రమేణా మన విద్యాసంస్థ ఉపాధ్యాయుల సంఖ్య పెరగడంతో సమస్య తీరుతుంది. మీరు కాదూ కూడదంటే గుర్తింపు కల ఓ ప్రైవేట్ విద్యాసంస్థ పావులు కదుపుతోంద'ని ఉత్తరం రాయండి," అన్నాడు తివారీ.

"ఆర్థికభారం లేదంటే సగం నియమాల్ని సడలించే వ్యవస్థ మనది. అలాగే మీరు చెప్పినట్టుగానే ఉత్తరం రాస్తాను. మీరు కూడా మీ సంస్థ అధ్యక్షుణ్ణి మా విద్యాసంస్థ అధ్యక్షుడికి రాయమనండి. అయితే ఉపాధ్యాయుల ఎంపిక చేసే బాధ్యత నాకు వదిలేయండి. మీరు జోక్యం చేసుకొంటే పక్షపాత ధోరణులను ఆపాదించే అవకాశముంటుంది. నాకు అందరూ కొత్తే కాబట్టి అందర్నీ నిష్పాక్షికంగా మరో కేంద్రీయ విద్యాలయ ప్రధానోపాధ్యాయుడితో కలిసి ఎంపిక చేస్తాను. పాఠాలు చెప్పే విధానం మే-

మిద్దరమూ, ఓ వారం రోజుల పాటు శీఘ్రతరమైన శిక్షణ ఇస్తాం. తర్వాత వారే అనుభవం-తో రాటుదేలి పోతారు!" అన్నాడు గణేశ్ ముఖోపాధ్యాయ!
"సర్! మీకు తెలుసునో, తెలియదో కానీ వారిలో చాలామంది ఇప్పటికే రాటుదేలిన ఉపాధ్యాయులు!"
"అదెట్లా?"

"అంటున్నానని ఏమి అనుకోవద్దుసార్! ఇటీవలి-కాలంలో విద్యా సంస్థలు-ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థలు అతి లౌక్యంగా గృహిణులకు యింట్లో పాఠాలు చెప్పే భారం అప్పజెప్పేస్తున్నారు. అందుకని మీరు పాఠశాల స్థాయీ ప్రమాణాలు పడిపోతాయని భయపడ నవసరం లేదు!.
పాఠశాలలో విద్యనెలా బోధించాలో మీ శిక్షణకింద వారు త్వరలోనే నేర్చేసుకొంటారు! ఆ భరోసా నాది!" అన్నాడు తివారీ నవ్వుతూ.
ఆ తర్వాత మరికొన్నిచిన్న చిన్న అభ్యంతరాలు సమసిపోయిన తర్వాత ఓ పదిమంది సంస్థ ఉద్యోగుల భార్యల్నీ, స్థానికంగా బోధనార్హత పట్టాలున్న ఉన్న ఆరుగురు ఉపాధ్యాయుల్నీని-యమించడం జరిగిపోయింది.
పాఠశాల కార్యాలయ నిర్వహణ కోసం దిగువతరగతి సహాయక సిబ్బందిని కార్మిక నియమాల ప్రకారం నియమించడం జరిగిపోయింది. అనుకొన్న ముహూర్తానికి పాఠశాలలోని ఒకటి నుంచి పది వరకూ తరగతులు ఒకేసారి ఊపందుకొన్నాయి. ముఖోపాధ్యాయ ఉపాధ్యాయుల-నందర్నీ గమనిస్తూ, అవసర-మైన మేరకే సలహాలనిస్తూ తన గౌరవం నిలబెట్టుకొన్నాడు. వారి గౌరవం నిలబెట్టాడు.
పాఠశాల ప్రారంభ సమయాని-కి తివారీ ఒక్కగానొక్క కూతురు అయిదో తరగతిలో చేరింది. ఆయనకి వాస్తవానికి కూతురు చాలా ఆలస్యంగా పుట్టింది. అందుకని భార్య భర్తలు ఆమెను చాలా అపురూపంగా చూసుకునే వారు. తివారీ భార్య భార్గవి అట్టే చదువుకోలేదు. పదో తరగతి వరకూ చదివి మానేసింది. అంచెలంచెలుగా పాఠశాల పటిష్ట-మై పోయింది. వార్షిక ఫలితాలు జయప్రదంగానే ఉంటూవచ్చాయి. సంస్థ ఉద్యోగులు కూడా నఖరాలు లేకుండా బదిలీలమీద వస్తూండడంతో ప్రాజెక్ట్ లక్ష్యాలు పెరుగుతూ, లక్ష్యసాధనలు జరుగుతూ తివారీ ప్రఖ్యాతి గాంచాడు.

తివారీ కూతురు నయన అన్ని పరీక్షల్లోనూ ప్రథమ, ద్వితీయ స్థాయిల్లోనో మార్కులు సాధించేది. తివారీ భార్య కూతురి చదువు స్థాయి చూసి మురిసిపోయేది. సంస్థ జరిపే సాంస్కృతిక కార్యక్రమాల్లో, ఇతర సందర్భాల్లో నయన ప్రతిభని గురించిన ప్రశంసలు విని పరవశించిపోయేది. పదో తరగతి బోర్డు స్థాయి పరీక్షల సమయానికి తివారీకి తన సంస్థ బోర్డు మెంబరుగా పదోన్నతి కలిగింది. ఘనమైన వీడ్కోలు పొంది వెంటనే వెళ్ళి చేరాడు. నయన పరీక్షలైయ్యేవరకూ ఆగి, భార్గవి కూతురితో సంస్థ కేంద్ర-మైన ఢిల్లీ చేరుకొంది. మే నెలాఖర్న బోర్డు పరీక్షల ఫలితాలు వచ్చాయి. తను పట్టుబట్టి సాధించిన ఉన్నత పాఠశాల తొంభై అయిదు శాతంతో ఉత్తీర్ణత పొందింది. మిగిలిన అయిదు శాతంలోనూ నయన ఆఖరులో ఉండిపోయింది.

కారణం ఊహించలేని తెలివి తక్కువవాడు కాదు తివారీ. కృతజ్ఞతభావంతో కూడిన అప్రకటిత చెంచాగిరీ నయనను ఎదగకుండా చేసింది.

"కారకులెవరూ అంటే .....? *

వచ్చే నెల మళ్ళీ కలుద్దాం
మీ
ఎలెక్ట్రాన్

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

( ఆధారం : జ = అసలు అక్షరం 'న' )

టే యు దా కం డ పి చు జి రూ లిం త గే జి

జో కు జొ చ్చం డ మ కి నీ క్యి జు గు చ గే జి

వ బ బు హ య్యుం రు దో జు డా వ ద త గే జి

డ దు డ జే సి ని వ ద్ధు ద న గు తు లే సు

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

నమ్మితి నా మనంబున సనాతనులైన యుమామహేశులన్
మిమ్ము బురాణదంపతుల మేలు భజింతు గదమ్మ! మేటి పె
ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతిసేయు మమ్మ నిన్
నమ్మినవారి కెన్నడును నాశము లేదు గదమ్మ యీశ్వరీ!

మార్చి నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు: శ్రీ పి. రావు

# కొత్త రామానందం



## వైశాఖ మాస వైశిష్ట్యం

భారతీయ సంస్కృతిలో వ్రతాచారణకి పరమోత్కృష్టమైన స్థానం ఇవ్వబడింది. సంవత్సరంలోని ప్రతి మాసానికీ ఒక ప్రత్యేకతను ఆపాదించి, అన్ని మాసాలు, అన్ని ఋతువులు విశిష్టమైనవే అని చాటి చెప్పే సంస్కృతి మనది. సంవత్సరంలోని పన్నెండు మాసాలలో కార్తీక, మాఘ, వైశాఖ మాసాలు మిక్కిలి శ్రేష్ట-మైనవిగా చెప్పబడుతున్నాయి.

శ్రీమహావిష్ణువుకి అత్యంత ప్రీతికరమైన వైశాఖమాసానికి 'మాధవమాసం' అని పేరు. కార్తీక మాఘ మాసాలలానే ఈ మాసంలో కూడా స్నాన, పూజ, దాన ధర్మాలవంటిని ఆచరించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. అన్ని మంత్రాలలో ఓంకారం, గోవులలో కామధేనువు, సర్పాలలో ఆదిశేషువు, నదులలో గంగానది, కాంతులలో సూర్యకాంతి, ఆయుధాలలో చక్రాయుధం, లోహాలలో సువర్ణం, పక్షులలో గరుత్మంతుడు, మణులలో కౌస్తుభమణి ఎలా ప్రసిద్ధాలో, మాసాలలో వైశాఖ మాసం అంత ప్రసిద్ధమయినది. ఈ వైశాఖమాసంలో నదీ స్నానం చేయాలని శాస్త్రవచనం. అందుకు అవకాశం లేనివారు పుణ్యనదులను స్మరించుకుంటూ కాలవలు, బావులవద్ద స్నానం చేయవలెను.

సూర్యోదయానంతరం ఆరు ఘడియలవరకు సమస్త దేవతలు, శ్రీమహావిష్ణువు ఆదేశం మేరకు జలములలో ఉంటారని, ఆ సమయంలో స్నానమాచరించడం వల్ల, వారి కరుణాకటాక్షాలు లభిస్తాయని శాస్త్రవచనం. పూర్ణిమనాడు సముద్ర స్నానం ఆచరించడం మంచిది. 'వైశాఖంలో సూర్యుడు మేష సంక్రమణంలో ఉండగా ప్రాతః స్నానం వల్ల కలిగే ఫలితాన్ని నాకు ప్రసాదించు మురారీ! మధుసూదనా' అనే మంత్రార్థంతో భక్తిశ్రద్ధలతో స్నానమాచరిస్తారు.

స్నానానంతరం శ్రీ మహావిష్ణువును తులసిదళాలతో పూజించడం శుభప్రదం. శ్రీమన్నారాయణుడు వైశాఖమాసం మొదలుకొని మూడునెలలపాటు, ఈ భూమిపై విహరిస్తూ ఉంటాడని చెప్పబడుతోంది. శ్రీమన్నారాయణునితో ఇష్ట దేవతారాధన కూడా చేయటం మంచిది. తదుపరి రావిచెట్టు వద్ద దీపం వెలిగించి ప్రదక్షిణ చేయాలి.

మూలతో బ్రహ్మరూపాయ
మధ్యతో విష్ణురూపిణే
అగ్రత శ్శివరూపాయ
వృక్ష రాజయతే నమః

అనే శ్లోకాన్ని ప్రదక్షిణ సమయాన చదువుతూ నమస్కరించాలి. ఈ విధంగా త్రికాలపూజతోనే నరునికి పునర్జన్మ లేదని పద్మపురాణం వచనం. అలాగే, గోవు వెనక భాగాన్ని నిమిరి, అటుపైన స్నానం చేసి, పిప్పల తర్పణం చేసి, గోవిందునికి అర్పించినవారికి ఎన్నడూ దుర్గతుల సంభవించవని చెప్పబడింది.

వైశాఖ స్నానాన్ని వైశాఖ శుద్ధపాడ్యమి నుంచి ప్రారంభించాలి. ఈ మాసంలో ఆరోగ్యవంతులు పగలు భోజనం మాని రాత్రిపూట భోజనం చేయడం ఉత్తమం. అయితే కొన్ని చేయకూడనివి కూడా ఉన్నాయి.

- వేడినీటి స్నానం చేయరాదు.
- తలంటు స్నానం చేయరాదు.
- తలకు నూనె రాసుకోరాదు.
- పగలు నిద్ర పనికిరాదు.
- మాంస భక్షణ పనికిరాదు.

వైశాఖ తదియ 'అక్షయ తదియ'గా పిలవబడుతోంది. ఈ తదియ సర్వ పాపాలనూ నశింప చేసేదిగా ప్రసిద్ధిచెందింది. సింహాచలం పుణ్యక్షేత్రంలో వరాహస్వామి వారికి చందనోత్సవం జరిపి, ఇప్పటివరకు పూసిన చందనాన్ని తొలగించి, ఆ తదియ రోజున నిజరూప దర్శనం కలుగజేస్తారు. ఆ రోజున స్నానమాచరించి నారాయణుని పూజిస్తే పాపరహితులై వైకుంఠవాస ప్రాప్తి కలుగుతుంది. పితృదేవతలకు శ్రాద్ధ కర్మలు చేస్తే వారు మోక్షం పొందుతారు.

వైశాఖ శుద్ధ ద్వాదశి విధి సర్వపాప పరిహారమైనది. ఆ రోజున ద్వాదశి వ్రతం చేసినవారికి గ్రహణకాలంలో గంగానదీ తీరంలో వెయ్యి గోవులను దానం చేసిన ఫలం కలుగుతుంది. ఆ రోజు రాత్రి విష్ణుపురాణం, హరినామ సంకీర్తన చేసి, జాగరణ చేస్తే, 8 పుణ్యనదులలో స్నానం చేసి, దానధర్మాలు చేసిన ఫలం కలుగుతుంది.

ఈ వైశాఖ మాసంలో నీరు, గొడుగు, విసనకర్ర, పాదరక్షలు దానం చేయాలి. చలివేంద్రాలను ఏర్పాటు చేసి దాహార్తుల దప్పిక తీర్చాలి. వీలయితే పండ్లు, పళ్ళ రసాలు, పానకం, వడపప్పు, పనసతొనలు, దోసపండు, కొబ్బరికాయ, పొంగలి, అరటిపళ్ళు, సుగంధద్రవ్యాల వంటి వాటిని దానం చేయడంవల్ల వంశంలోని ఏడు తరాలవారికి వైకుంఠ ప్రాప్తి కలుగుతుంది. బ్రాహ్మణునకు మంచి గంధం, సుగంధ ద్రవ్యాలు రాసి, విసన కర్రతో విసిరితే పుత్రా పౌత్రాభి వృద్ధి కలిగి, అష్టైశ్వర్యాలతో తుల తూగి జన్మాంతరంలో వైకుంఠ ప్రాప్తి కలుగుతుంది.

వైశాఖ శుక్లపక్ష త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమ తిథులు అతి-ప్రధానమైన పుణ్యదినాలు. ఈ మూడు తిథులలో ఏ తిథిలోనైనా నదీస్నానం చేస్తే సంపూర్ణ మాసఫలం పొందగలుగుతారు. పౌర్ణమి రోజున అన్ని తీర్థాలలోని దేవతలు విష్ణువులో ఉంటారు. విష్ణుమూర్తిని తులసి దళాలతో పూజించి విష్ణుపురాణం ఆలకిస్తే బ్రహ్మహత్య, గోహత్య, శిశుహత్య, పరధనాపహారం, మాంస భక్షణ, సురాపానం మొదలగు అత్యాచార దోషాలన్నీ పటాపంచలైపోతాయి.

పూర్వం దేవదానవులు పాలసముద్రాన్ని మథించి అమృతం వెలికితీసినది శుద్ధ ఏకాదశినాడు. శ్రీహరి దానిని భద్రపరచి దేవతలచేత త్రాగించినది త్రయోదశినాడు, చతుర్దశినాడు దేవవిరోధులైన దానవులను సంహరించాడు. రాక్షస వినాశనానంతరం దేవతలు తిరిగి స్వర్గలోకాధిపత్యాన్ని పొందినది పౌర్ణమి నాడు కనుక, ఈ మూడు తిథులు దేవ ప్రీతికరాలై గొప్పఫలాన్ని చేకూరుస్తాయి.

విశాఖ అంటే కాంతిని వ్యాపింప జేసేదని అర్థం. అటువంటి విశాఖ నక్షత్రంలో కూడిన పున్నమికి వైశాఖి అని పేరు. దీనినే 'మహా వైశాఖి' అని కూడా అంటారు. మహా వైశాఖి పుణ్యదినాన మహా దధి తో స్నానం చేసి పురుషోత్తముని దర్శనం చేస్తే కోటి జన్మల పాపం పోతుందని అంటారు. ఈరోజున 'బ్రహ్మపురాణం'ను దానం చేస్తే బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుంది. ఇది వైశాఖ మాస ప్రాశస్త్యం.

## రామయ్య పెళ్లి పెద్దగా సత్యదేవుని కల్యాణం

కొత్తగా పెళ్ళయిన ప్రతి జంటా అన్నవరం సత్యదేవుని వ్రతం చేసుకుంటుంది. నూతన గృహప్రవేశం సందర్భములో స్వామివారి ఆశీస్సులు కోరుతూ ఘనంగా వ్రతం చేస్తారు. సత్యదేవుడేమో నిత్య పెళ్ళికొడుకు. ఏడాదికొకసారి వైశాఖ మాసంలో వార్షిక కల్యాణం జరిపించుకుంటాడు. అన్నవరం కొండపై వారం రోజుల పాటు అనగా వైశాఖ శుద్ధ దశమి నుంచి బహుళ పాడ్యమి వరకూ,

రోజుకొక వేడుక చొప్పున వివిధ వైదిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ ఉత్సవాలకు పెళ్లిపెద్దలుగా రత్నగిరి క్షేత్ర పాలకులు శ్రీ సీతారాములు వ్యవహరిస్తారు.

దీనినే వార్షిక కల్యాణం అంటారు. పాంచరాత్రాగమ పద్ధతిలో వారం రోజులపాటు జరిగే ఈ కళ్యాణోత్సవాన్ని తిలకించడానికి రెండు కన్నులు చాలవు. వైశాఖ శుద్ధ ఏకాదశి నాడు సత్యదేవుని దివ్యకల్యాణానికి రత్నగిరిని ముస్తాబు చేస్తారు. ఏకాదశినాటి రాత్రి 9.30 గంటలనుండి స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. కల్యాణం జరిగే వారం రోజులు సత్యదేవుని కళ్యాణ వేడుకలలో పాల్గొనుటకు వేలాది భక్తులు వేసవి ఎండలు, వాటి తీవ్రత లెక్క చేయకుండా స్వామి ఆశీస్సులు పొందడానికి వెళతారు. ఏకాదశి రాత్రి కల్యాణాన్ని తిలకించి తమ జన్మ ధన్యమయినట్లుగా భావిస్తూ, దేవస్థానం వారు ప్రతి భక్తునికీ అందించిన బంగీ ప్రసాదం, మంచి ముత్యాలు, అక్షింతలు తమతో తీసుకువెడతారు.

సత్యదేవుని కల్యాణంలో పాల్గొనుటకు, రాష్ట్ర ప్రభుత్వ అమాత్యులు, జిల్లా యంత్రాంగం అధికారులు, అనధికారులు, భక్తసమూహములు, దేవస్థాన కార్యసిబ్బంది, పురోహిత బృందం అందరూ ఉపస్థితులై ఉండగా



వధువు అనంతలక్ష్మి సత్యవతి అమ్మవారి మెడలో శ్రీ సత్యనారాయణస్వామి వరుడిగా మంగళ సూత్రాన్ని కడతారు. రాష్ట్ర ప్రభుత్వం వారు సమర్పించిన ముత్యాల తలంబ్రాలను, అర్చక స్వాముల ఆధ్వర్యంలో వధూవరులకు తలంబ్రాలను సమర్పిస్తారు. భద్రాచలం నుంచి కోదండస్వామి వారు పంపించిన పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సత్యదేవ దంపతులకు ప్రేమతో సమర్పిస్తారు. ఆనందమయ వాతావరణంలో నూతన దంపతులకు మంగళ హారతి ఇవ్వగానే కల్యాణవేడుకలు ఆ రోజున ముగుస్తాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఉండుటకు పోలీసు బృందాలు, వివిధ సంఘాల వాలంటీర్లు తమ సేవలు అందిస్తారు.

కల్యాణవేడుకలలో వారం రోజులపాటు వేదోక్తంగా కమనీయంగా, జనరంజకంగా అర్చకులు తమ పాత్రను చక్కగా నిర్వహిస్తారు. మొదటి రోజు నిర్వహించే వేడుకోలు ఉత్సవం చూచి తీరవలసిందే కాని వర్ణించలేము. మగపెళ్లివారిగా కొందరు పురోహితులు తమ పాత్రను వహిస్తే, ఆడపెళ్ళి వారి తరఫున మరికొందరు తమ పాత్ర వహిస్తారు. ఇరువర్గాలవారు తాము గొప్పంటే తాము గొప్పని చణుకులు విసురుకొంటారు. హాస్యజల్లులు జోరుగా కురుస్తాయి. సంతోషమయ వాతావరణం వెల్లివిరుస్తుంది.

కల్యాణోత్సవ రెండవ రోజున శాస్త్రోక్తంగా వేదమంత్రాల మధ్య అంకురార్పణ, ధ్వజారోహణం, కంకణ ధారణ కార్యక్రమాలు ఉదయం జరిగితే, ఆరోజు రాత్రి

9.30 గం||లకు సకల దేవతలు కళ్యాణ వేడుకలు చూచుటకు వస్తారు. కల్యాణం కమనీయంగా భక్తుల గోవింద నామస్మరణల మధ్య ముగుస్తుంది. భక్తులకు తలంబ్రాలు అందజేస్తారు. మూడవరోజు రాత్రి 7 గం||లకు స్వామి అమ్మవార్లకు పురోహితులు అరుంధతీ నక్షత్ర దర్శనం కలుగ జేస్తారు. నాల్గవ రోజు మధ్యాహ్నం 2 గం||లకు సరస్వతీ పూజ, సదస్యం, పండిత సన్మానం తంతులు జరుపుతారు. ఐదవరోజు సాయంత్రం నాలుగు గంటలకు వధూవరుల వనమహోత్సవ వేడుక చక్కగా నిర్వహిస్తారు. ఆరవరోజు ఉదయం పంపా సరోవరంలో చక్రస్నానం నిర్వహిస్తారు. అచ్చట హాజరయిన భక్తులందరూ సుదర్శన చక్రం నీటిలో మునక వేయగానే ఒక్కసారిగా నదిలో ఒక్క మునుగు మునిగి తాము పవిత్రులైనట్లుగా భావిస్తారు. ఆరోజు సాయంత్రం 4 గం||లకు నీలలోహిత గౌరీ పూజ, దండియా దింపు తంతులు వేదోక్తంగా నిర్వహించిన పిమ్మట ధ్వజారోహణం జరుగుతుంది. కార్య నిర్వాహకులు తమ కంకణాలను తీసివేస్తారు. ఇక కళ్యాణోత్సవ ముగింపు రోజున రాత్రి 7 గం||లకు పుష్ప యాగం జరుపుతారు.



### అన్నవరం చేరుకునే మార్గం

అన్నవరం తూర్పు గోదావరి జిల్లా శంఖవరం మండలంలో ఉంది. రాజమండ్రి నుంచి 70 కి.మీ., కాకినాడ నుంచి 45 కి.మీ దూరంలో విజయవాడ - విశాఖపట్నం నేషనల్ హైవేకు ఆనుకుని రత్నగిరి అలరాలుతున్నది. కొండపైకి వెళ్ళుటకు కొండమెట్లు రెండు ఘాట్ మార్గాలున్నాయి. భక్తులు ఉండుటకు వసతి, భోజన సౌకర్యాలు అందు బాటులో ఉన్నవి. అన్నవరం రైల్వే స్టేషన్ లో చాలా రైళ్ళు యాత్రికుల సౌకర్యార్ధం ఆపుతున్నారు.

## స్థలపురాణం

పర్వతరాజు మేరువు, ఆయన భార్య మేనక కుమారులైన రత్నాకరుడు, భద్రుడు పరమ విష్ణు భక్తులు. వారు ఆ హరిని తమ శిరస్సున దాల్చాలన్న కోరికతో తపస్సు చేశారు. వారి కోరిక మేరకు నారాయణుడు భద్రుని శిరస్సుపై (భద్రాచలం) వైకుంఠ రాముడిగానూ, రత్నాకరుడిపై (రత్నగిరి) సత్యనారాయణుడిగాను అవతరించాడు. ఇక ఈ ప్రాంతానికి తొలినుండి అన్నవరం అనే పేరు లేదు. బెండపూడి సంస్థానాన్ని పరిపాలించిన అన్నయ్య మంత్రి పేరు మీదుగా అన్నవరం పేరు స్థిరపడిందని అంటారు. ఇక ఆలయ నిర్మాణం విషయానికి వస్తే .... ప్రస్తుతమున్న గుడిని 1891 లో (ఖర నామ సంవత్సరం) కిర్లంపూడి సంస్థా నాధీశుడైన రాజా ఇనుగంటి వెంకట రామనారాయణ బహద్దూరు నిర్మించారు. పైనుంచి చూస్తే ఈ ఆలయం రథం ఆకారంలో ఉంటుంది.

త్రేతాయుగంలో రామరావణులూ, ద్వాపరయుగంలో అర్జునుడూ ఈ క్షేత్రాన్ని సందర్శించారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సీతమ్మను అపహరించేందుకు లంక నుంచి భద్రగిరికి పయనమైన రావణబ్రహ్మ పుష్పక విమానం ఈ ప్రాంతానికొచ్చేసరికి ముందుకు కదలలేదుట. కారణమేమని చూసిన రావణుడికి రత్నగిరిపై ఒకే పీఠాన హరిహరులు కనిపించారట. సహజంగా హరిద్వేషి అయినప్పటికీ శివునితో కలిసి ఉన్న హరికి పూజలు చేశాడట. ఆ రాక్షస వీరుడు తన తలపై స్వామిని మోసాడట. అందుకు నిదర్శనంగా ఇప్పటికీ ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాల్లో ఉత్సవమూర్తులను రావణ వాహనంపై ఊరేగిస్తారు.

సీతాదేవి కనబడక కలత చెందుతున్న రాముడి బాధను తీర్చాలన్న ఉద్దేశంతో లక్ష్మణుడు ఒక మునిని ఆశ్రయించాడు. ఆయన సత్యదేవుని వ్రతం చేయమని చెప్పడంతో రామలక్ష్మణులు అన్నవరానికి వచ్చి వ్రతం చేయగా సుగ్రీవుడు పరిచయమై సీతాన్వేషణలో సాయపడ్డాడని చెబుతారు. అలాగే ద్వాపర యుగంలో కురుక్షేత్ర యుద్ధానంతరం అర్జునుడు పాపభారంతో కుంగిపోతుండగా 'సత్యదేవుని పూజించి 108 దుర్గాలయాలు నిర్మిస్తే పాపం పోతుంది' అని



నారదుడు సలహా ఇచ్చాడట. ఆ సలహా మేరకు అర్జునుడు అన్నవరం వచ్చి స్వామిని పూజించాడనీ, ఇక్కడి వనదుర్గ ఆలయం ఆ పాండవ మధ్యముడు నిర్మించిందేనని 'అద్భుత జంబూ ద్వీప రహస్యం' అనే గ్రంథం చెబుతోంది.

1891సం||లో ఆలయ నిర్మాణం జరిగింది. రాతితో నిర్మించిన రెండస్తుల ఈ ఆలయంలో పొడుగాటి ఏకశిలా స్థంభం రూపంలో త్రిమూర్తులు కొలువై ఉన్నారని భక్తుల నమ్మకం. ఈ స్తంభానికి పీఠ భాగంలో బ్రహ్మదేవుడూ, మధ్య భాగాన పరమశివుడూ ఉండగా అగ్రభాగాన రమాదేవి సమేతంగా సత్యనారాయణుడు భక్తులకు దర్శనమిస్తాడు. గర్భాలయంలో సత్యనారాయణ స్వామికి కుడివైపు శివుడు కొలువై ఉన్నాడు. అలా ఆ త్రిమూర్తులు వెలసిన ఆ అరుదైన ఆలయానికి యుగాల చరిత్ర ఉందంటారు భక్తులు.

కులమతాలతో సంబంధం లేకుండా ఏటా సుమారు పదిహేను లక్షల మంది భక్తులు అన్నవరంలో వ్రతమాచరిస్తారని అంచనా. అర్చకులు శ్రద్ధగా వ్రతం చేయిస్తారు. వ్రతంలో ప్రధానమయినది కథలు. అన్నవరం క్షేత్రంలో నాలుగు కథలు ప్రసిద్ధం. అన్ని పురాణ కథలకు మాదిరిగానే, ఈ వ్రత కథలు కూడా నైమిశారణ్యంలో ప్రారంభమవుతాయి. అన్నింటి లక్ష్యం ఒక్కటే. సత్యం పలకాలి అనే నీతిని బోధించడం, ఇచ్చిన మాటపై నిలబడాలి అనే సందేశం ఇవ్వడం. ఈ కథలను పరిశీలిస్తే అన్నింటి సారాంశం ఒక్కటే: 'ప్రసాదం భక్తిపూర్వకంగా స్వీకరించడం, సత్యవాక్యం పలకడం'.

**ది. 26 - 4 - 2018 న సత్యదేవుని కల్యాణం.**

# జనార్ధన ఠాకూర్

## ఏప్రిల్ 2018 లో మీ రాశి ఫలాలు



9963933371, 9490189713

ఏప్రిల్ లో : రవి 14 వరకు మీనంలో తదుపరి మేషంలో; బుధుడు మీనంలో ; కుజుడు ధనస్సులో; శుక్రుడు మేషంలో ; గురువు తులలో; శని ధనస్సులో; రాహువు కర్కాటకంలో; కేతువు మకరం లో సంచారం

**మేష రాశి:**

ఈ రాశివారికి ఆర్థిక స్థితి ఆశాజనకంగా ఉండును. నష్టాలు జరిగే సూచనలు కలవు. ఆరోగ్య విషయంలో ముందు చర్యలు అవసరం. ప్రయాణం వలన అలసట. కుటుంబంలో ఒక వ్యక్తి యొక్క ఆరోగ్య విషయం కలవరపరచును. కుటుంబ వాతావరణం అనుకూలంగా ఉండదు. అకారణ కలహాలు వస్తాయి. ఉద్యోగులకు తమ ప్రతిభను చాటే సమయం, అందువల్ల అదనపు బాధ్యతలు లేదా పదోన్నతి లభించును. వ్యాపారస్తులు తమ వ్యాపార పరిధిని విస్తరిస్తారు. కాని చట్టపరమైన చిక్కులు రాకుండా చూసుకొనవలెను. విద్యార్థులకు పరీక్షాకాలం. సమయస్ఫూర్తి కావాలి. 3 వ తేదీ రాత్రి నుండి 6 వ తేదీ ఉదయం మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) శ్రీరామ రక్షా స్తోత్రాన్ని పారాయణ చేస్తే మంచిది.

2) విద్యార్థులు మేధా దక్షిణామూర్తి శ్లోక పఠనం ద్వారా శుభఫలితాలు పొందుతారు.

**వృషభరాశి:**

ఈ రాశివారు అధిక ఖర్చుల వలన సతమతమౌతారు. ఆరోగ్యము బాగుండును కానీ చిన్న చిన్న వ్యాధులు బాధించును. గృహం మార్పు, బంధువులతో కయ్యం, నిందారోపణలకు గురి అవుతారు. ఉద్యోగస్తులకు అనుకూల సమయం, పదోన్నతి కొరకై ఎదురుచూచువారికి శుభ సమయం. వ్యాపారస్తులకు అనుకూల సమయం. స్థిరాస్తి విషయంలో అనుకూలత లభించును.దూరప్రయాణ సూచన. విద్యార్థులు చదువుయందు శ్రద్ధ వహించాలి. 6 వ తేదీ ఉదయం నుండి 8 వ తేదీ రాత్రి వరకు మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) కనకధారాస్తవ స్తోత్ర పారాయణ చేస్తే మంచిది. 2) విద్యార్థులు గురుస్తోత్ర పారాయణ చేయుట ద్వారా శుభఫలితాలు.

**మిథున రాశి:**

ఈ రాశివారికి ఆర్థిక స్థితి మెరుగు పడును కానీ ఖర్చులు అదుపులో ఉంచుకొనవలెను. ఆరోగ్యము బాగున్నా వంటి సమస్యలు బాధించును. కుటుంబ వాతావరణం అనుకూలంగా ఉండును. అవివాహితలకు కల్యాణయోగం. అల్లులతో స్నేహం మీకు చికాకులు కల్గించును. ఉద్యోగ స్తులకు అనుకూల సమయం. పదోన్నతికై ఎదురుచూచువారికి శుభసమయం. అదనపు బాధ్యతలు పొందు అవకాశం కలదు. వ్యాపారస్తులకు అనుకూల సమయం కానీ వ్యాపారంలో పనిచేయు వారి వలన ప్రతికూల పరిణామాలు ఎదుర్కొంటారు. విద్యార్థులకు పై చదువుల ప్రయత్నాలు ఫలిస్తాయి. 8వ తేదీ రాత్రి నుండి 11 వ తేదీ మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) నవగ్రహ ఆరాధన ప్రతికూల ఫలితాలు తగ్గించును.

**కర్కాటక రాశి :**

ఈ రాశివారికి ఆర్థికస్థితి బాగున్నా అధిక ఖర్చులు కలిగివుంటారు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడువారు ముందు జాగ్రత్తలు తీసుకొనుట మంచిది. బంధుమిత్రులతో కలహాలు రావచ్చును. కొందరికి గృహమార్పు జరుగును. ప్రయాణములవలన అలసటకు గురిఅవుతారు. ఉద్యోగస్తులకు మిశ్రమకాలం. వ్యాపారస్తులు గడ్డుకాలం ఎదుర్కొంటారు. ప్రజాజీవితంలో ఉన్నవారు ఆకస్మికంగా పేరు సంపాదిస్తారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళితే మంచి ఫలితాలు సంపాదిస్తారు. 11 వ తేదీ నుండి 13 వ తేదీ మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) దుర్గాదేవి ఆరాధన, మరియు 2) శివాభిషేకం ద్వారా శుభఫలితాలు పొందుతారు.

**సింహ రాశి:**

ఈ రాశివారికి ఆర్థిక స్థితి అనుకూలంగా ఉండును కానీ స్పెక్యులేషన్ జోలికి పోవద్దు. ప్రమాదాలు, గాయాలు, ప్రమాదవశాత్తు జారిపడుట ద్వారా రక్తము పోగొట్టుకొందురు. జాగ్రత్త అవసరం. గృహ వాతావరణం అనుకూలంగా ఉండును కానీ మీకన్నా చిన్నవారి ద్వారా మానసిక చికాకు కలుగును. ఉద్యోగస్తులకు వృత్తి యందు మార్పు కలుగును. కోర్ట్ వ్యవహారములు వికటించవచ్చును. ఇతరులతో వాదోపవాదములకు దూరముగా ఉండవలెను. వ్యాపారస్తులు అదనపు పెట్టుబడులు పెట్టవద్దు. విద్యార్థులు స్థిత ప్రజ్ఞత చూపవలెను, లేనిచో గ్రేడ్లు తగ్గు అవకాశము కలదు.

13 వ తేదీ సాయంకాలం నుండి 16 వ తేదీ ఉదయం మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన : 1) సూర్య ఆరాధన మరియు 2) సుబ్రహ్మణ్యేశ్వర ఆరాధన ద్వారా ప్రతికూలత తగ్గును.

**కన్యారాశి:**

ఈ రాశివారికి ఆర్థిక స్థితి బాగా ఉండును. ఆరోగ్యవిషయములో శ్రద్ధ అవసరం. ఆహార నియమాలు పాటించాలి. గృహ వాతావరణం అనుకూలంగా వున్నా మీరు ఇంటి విషయాలలో శ్రద్ధ వహించాలి. అనవసరపు వాద ప్రతివాదనలకు దూరంగా ఉండాలి. స్థిరాస్తి విషయంలో చిక్కులు వచ్చు అవకాశం కలదు. రచనా వ్యాసాంగ రంగంలో ఉన్నవారికి అనుకూల సమయం. వ్యాపారస్తులకు అనుకూల సమయం. విద్యార్థులకు పోటీ పరీక్షలలో విజయం.16 వ తేదీ ఉదయం నుండి 18 వ తేదీ మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం. వైదిక సూచన: 1) శనికి జప దానాలు మరియు 2) హనుమంతునికి వడమాల సమర్పించుట ద్వారా శుభఫలితాలు పొందుతారు.

**తులా రాశి:**

ఈ రాశివారు ఈ మాసంలో విశేషమైన శుభఫలితాలు పొందుతారు. ఆర్థిక వాతావరణం అనుకూలంగా ఉండును. స్థిరాస్తి అమ్మకం ద్వారా నష్టం చవిచూస్తారు. గృహంలో పెద్దవారి ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం.కొందరు తీర్థయాత్రలు చేసే అవకాశం కలదు. ఉద్యోగస్తులు తమ సామర్థ్యం చూపి మంచి ఫలితాలు పొందు కాలం. వ్యాపారస్తులు అధిక లాభాలు పొందుతారు. విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. పెద్దల వాక్కు వినడం ద్వారా లాభం పొందుతారు. విద్యార్థులు చదువులో పూర్తిగా నిమగ్నం కావలెను లేనిచో గ్రేడ్లు తగ్గే అవకాశం కలదు. పరీక్షాకాలంలో సమయస్ఫూర్తి కావాలి. 18 వ తేదీ ఉదయం నుండి 20 వ తేదీ ఉదయం మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం. వైదిక సూచన: 1) దుర్గాస్తోత్ర పారాయణ మరియు 2) విద్యార్థులకు శ్రీ హయగ్రీవ ఆరాధన వలన శుభఫలితాలు.

**వృశ్చిక రాశి :**

ఈ రాశివారికి లక్ష్యంపై దృష్టి సారించుట శ్రేయస్కరం. ఆకస్మిక ధనలాభం కలుగు అవకాశం కలదు. జీవితభాగస్వామి యొక్క ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించవలెను. ఆహార విషయంలో శ్రద్ధ వహిం-

చవలెను. కొత్త పరిచయాలవలన నష్టం కలగవచ్చును. ఆధ్యాత్మిక చింతన అవసరం. ఉద్యోగస్తులకు పై అధికారుల సహాయ సహకారాలు లభిస్తాయి. వ్యాపారస్తులకు అనుకూలసమయం. లీగల్ వ్యవహారాలు వాయిదా వేయుట క్షేమకరం. విద్యార్థులు చెడు స్నేహితులకు దూరంగా వుండి చదువుపై శ్రద్ధ చూపవలెను. 20 వ తేదీ ఉదయం నుంచి 22 వ తేదీ మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం. వైదిక సూచన: 1) కనకదుర్గ అమ్మవారి దర్శనం 2) సద్గురువు ఆశీర్వాదం పొందుట ద్వారా శుభఫలితాలు.

**ధను రాశి :**

ఈ రాశివారికి అధిక ఖర్చుల వలన ఆర్థిక స్థితి కలవరపరచును. అత్యంత జాగ్రత్త వహించవలెను. ఆరోగ్య పరిస్థితి అనుకూలంగా ఉండును కాని ప్రమాదాలు జరిగే అవకాశం కలదు. బంధువర్గం నుండి ప్రతికూలత. స్థలం మార్పు జరిగే అవకాశం కలదు. గృహంలో శాంతి వాతావరణం ఉండును. వివాహం కానివారికి తగిన సంబంధం లభించును. ఉద్యోగస్తులకు కొంత గడ్డు స్థితి. పై అధికారులవలన చికాకు కలుగును. వ్యాపారస్తులకు సామాన్యకాలం. విద్యార్థులకు అతి శ్రద్ధ ద్వారా పై చదువులకు అవకాశం లభించును. 22 వ తేదీ నుండి 24 వ తేదీ మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం. వైదిక సూచన: 1) కనకధారాస్తవం నిష్టగా పారాయణం చేయుట 2) హనుమాన్ చాలీసా పారాయణ చేయుట ద్వారా ప్రతికూలత తగ్గును.

**మకర రాశి:**

ఈ రాశివారికి నష్టాలు, అధిక ఖర్చుల వలన ఆర్థిక స్థితి గందరగోళంగా వుండు అవకాశం కలదు. ఆరోగ్యము బాగుండదు కానీ సకాలంలో వైద్యం వలన మెరుగుపడును. ప్రమాదాల బారిన పడే అవకాశం కలదు. శ్రమతో కూడిన ప్రయాణాలను రద్దు చేసుకొనుట ఉత్తమం. కుటుంబ సభ్యుల సహకారం లభించును. పరిశోధనారంగంలో ఉన్న విద్యార్థులకు అనుకూల సమయం. సమయం. 24వ తేదీ రాత్రి నుండి 26 వ తేదీ మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం. వైదిక సూచన: 1) సుందరకాండ పారాయణ 2) శ్రీ వేంకటేశ్వర స్వామి ఆరాధన వలన శుభఫలితాలు.

**కుంభ రాశి:**

ఈ రాశివారికి ఆర్థిక స్థితి ఉన్నతంగా ఉండును. నూతన వస్తు సేకరణ, ఆరోగ్యం బాగుండును. కుటుంబ సభ్యులతో కలిసి సంతోష జీవనం. కొంతమంది స్నేహితులవలన కీడు జరిగే అవకాశం కలదు. ప్రయాణము వలన లాభం. లీగల్ వ్యవహారములు అనుకూలించును. ఉద్యోగస్తులకు అనుకూల సమయం. భాగస్వామ్య వ్యాపారస్తులకు అనుకూల సమయం. వ్యవసాయం ద్వారా మంచి ఆదాయం. క్రీడారంగంలో ఉన్నవారికి అనుకూలసమయం. 26 వ తేదీ రాత్రి నుండి 28 వ తేదీ మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం. వైదిక సూచన: 1) కులదేవత ఆరాధన 2) పుణ్య నదీ స్నానం వలన ఉత్తమ ఫలితాలు లభించును.

**మీన రాశి :**

ఈ రాశివారికి ఆర్థిక స్థితి అనుకూలం. చిన్న ఆరోగ్య సమస్యలతో, ముఖ్యంగా నేత్ర సంబంధ, బాధపడవచ్చును. ఉద్యోగస్తులకు మిశ్రమ కాలం. ఓర్పు మరియు సహనం అవసరం. కొన్ని పనులు వాయిదా వలన చికాకు పొందెదరు. మిత్రుల సహాయం అందుతుంది. వ్యాపారస్తులకు అనుకూల సమయం కాదు. విద్యార్థులు అధిక శ్రమ ద్వారా ఉత్తమ ఫలితాలు పొందుతారు. 28వ తేదీ నుండి 30 వ తేదీ మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) ఆదిత్య హృదయ పారాయణ

2) శ్రీ లక్ష్మీ స్తోత్ర పారాయణ ద్వారా శుభ ఫలితాలు.

**సర్వే జనాస్సుఖినో భవంతు**



భద్రాద్రి
శ్రీ సీతారాముల
కళ్యాణ
వేడుకలు




వొంటిమిట్ట
శ్రీ కోదండ
రామాలయ
బ్రహ్మోత్సవాల
సందర్భంగా




చింతలపూడి ప్రాధమిక పాఠశాల వార్షికోత్సవాలు

RNI No. APTEL/2011/39497 APRIL 2018 Postal No. HSE/1043/2017-19

Date of Publishing: 1st April Date of Posting: 8th April





Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001